Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 12

మంగళవారం, 25 ఫిబ్రవరి, 2025




## లింగమూర్తి మరణంతో మేడిగడ్డ కేసులో ట్విస్ట్..

## కేసీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్



హైదరాబాద్: మేడిగడ్డ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో ఇవాళ కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధినేత.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు వేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. తీర్పు రిజర్వు చేసింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. తీర్పును తర్వాత వెల్లడిస్తామని తెలిపింది. మేడిగడ్డ కుంగిన వ్యవహారంపై భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీష్ రావులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇవాళ (ఫిబ్రవరి24) హైకోర్టు విచారణ జరపింది. విచారణ సందర్భంగా.. లోయర్ కోర్టులో పిటిషన్ వేసిన రాజలింగమూర్తి చనిపోయాడని కేసీఆర్, హరీష్ తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# బీఆర్ఎస్ బీజేపీ డీల్



### రాష్ట్ర అభివృద్ధిని బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల అడ్డుకుంటున్నారు

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత.. మీ ఓటు ఎవరికో చెప్పాలి

**ఫోన్ ట్యాపింగ్ నిందితులను భారత్‌కి తేలేరా?**

**బీఆర్ఎస్ స్కామ్‌ల ఫైళ్లను ఈడీ తీసుకెళ్లింది**

**పట్టభద్రులు గమనిస్తున్నారు..**

**నరేందర్ రెడ్డిని గెలిపిస్తే సమస్యల పరిష్కారం**

**నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ బహిరంగ సభల్లో సీఎం రేవంత్ రెడ్డి**

**నిజామాబాద్/మంచిర్యాల/కరీంనగర్ ఫిబ్రవరి 24:** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మూడు బహిరంగ సభల్లో ప్రసం గించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇటు బీఆర్ఎస్ అటు బీజేపీని తూర్పారపడుతూ.. ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యా యని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితు లు ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు అమెరి కా నుంచి భారత్ రాకుండా బీజేపీ సహకారాన్ని బీఆర్ఎస్ తీసుకున్నదని సీఎం ఆరోపించారు. పక్కా డాక్యుమెంట్లతో వెళ్లిన విద్యార్థులను అమెరికా ప్రభు త్వం సంకెళ్లు వేసి తిరిగి పంపిస్తుంటే, ఫోన్ ట్యాపింగ్ నిందితులు ఎందుకు భారత్‌కు రాలేకపోతున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వారు తిరిగివస్తే విచారణ జరిపి వారిని సత్వరం చంచల్‌గూడ జైలుకు పంపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గొర్రెల స్కామ్ కేసు, ఈ ఫార్ములా రేస్‌తో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రాజెక్టుల అన్ని కుంభకోణాల - మిగతా 2వ పేజీలో



అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు నిర్వీర్యం

సీఎం అసమర్థతను బీజేపీపై రుద్దే యత్నం

ఈ కేసును రేవంత్ వదిలినా.. మేం వదలం...

దెయ్యమని తిట్టి.. సోనియా కాళ్లు మొక్కిందెవరు?: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# బీఆర్ఎస్‌తో రేవంత్ కుమ్మక్కు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** బీఆర్ఎసతో కుమ్మక్కై.. సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసును నిర్వీర్యం చేశారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్.. కేంద్రాన్ని బద్‌నాం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు తేడా ఏమీ లేదని.. కేసీఆర్ నుంచి పుణికిపుచ్చుకున్నట్లుగా రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన రేవంత్.. సీఎం అయ్యాక బీఆర్ఎసతో కుమ్మక్కై కేసును నిర్వీర్యం - మిగతా 2వ పేజీలో

## బీఆర్ఎస్ స్కాంలను సీబీఐకిచ్చే దమ్ముందా?

చీకటి ఒప్పందాలు మీరు చేసుకుని మాపై బురద జల్లుతారా?

విచారణ మీరు చేస్తూ.. మమ్మల్ని అరెస్ట్ చేయమంటారా?

సీఎం రేవంత్‌కు సంజయ్ కౌంటర్ - 2వ పేజీలో

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 20న

### మార్చి 29 నాటికి పదవీకాలం ముగియనున్న ఐదుగురు ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రాష్ట్ర శాసనమండలిలో ఖాళీకా నున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల (ఎమ్మెల్యే కోటా) ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ సోమవా రం ప్రకటించింది. తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు సంబం ధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించడంతో.. సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కమిషన్ విడు దల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 3ననోటిఫికేషన్ విడుదల చేస్తారు. నామినేషన్లకు ఆఖరు తేదీ మార్చి 10. దాఖలైన నామినేషన్ల స్క్రూటినీ మార్చి 11న చేపడతారు. మార్చి 13న నామినేషన్ల ఉపసం హరణకు చివరి రోజు. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ - మిగతా 2వ పేజీలో

## దస్ పర్సంటేజ్ సర్కారు: కవిత



**మహబూబాబాద్/ కేసముద్రం, ఫిబ్రవరి 24:** తెలంగాణలో దస్ పర్సంటేజ్ సర్కార్ నడుస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన లేదని, పర్సంటేజీల పాలన నడుస్తోందని, పర్సంటేజీలు ఇచ్చిన - మిగతా 2వ పేజీలో

# ఆశల గాలింపు!


**'ఎస్ఎల్‌బీసీ'లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**

**పెను సవాళ్లుగా బురద, మట్టిదిబ్బలు, నీటి ఊట**

**8 మందిని కాపాడేందుకు రంగంలోకి 584 మంది**

**అత్యాధునిక సాంకేతికత వినియోగం**

**పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి**



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 24:** శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో శనివారం చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ, ఆర్మీ, ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు చేస్తున్న ప్రయత్నా లు 'ఒక అడుగు ముందుకు పడితే.. పదడుగులు వెనక్కి..' అన్న చందాన మారిపోయాయి. సొరంగంలో ఊరుతున్న నీటి ఊట, మట్టిదిబ్బలు, బురద బృందాలకు పెద్ద సవాల్‌గా పరిణమించాయి. సర్కార్ దేశ, విదేశాల నుంచి అత్యాధునిక పరికరాలు తీసుకొచ్చి మరీ రెస్క్యూ ఆపరేషన్ చేయిస్తున్నది. ప్రత్యేకంగా ఉత్తరకాశి ర్యాట్ మైనర్స్ బృందాన్ని రంగంలోకి దింపి కార్మికుల జాడ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. బృందం గాలింపు చర్యలకు 'ఆక్వాఐ' అనే సాంకేతికతను వినియోగిస్తున్నది. కార్మికుల ఆచూకీ వెతికేందుకు యాంజియోగ్రఫీ కెమెరాను వినియోగిస్తున్నది. అంతకుముందు నీటి ఊటను డీ వాటరింగ్ చేసేందుకు పొక్లెయిన్లను సైతం పంపించింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, హైడ్రా, ఝూర?ం డ్ మైనింగ్, ఐఐటీ మద్రాస్, సింగరేణి రెస్క్యూ బృందాలు కూడా ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో భాగస్వాములవుతున్నాయి. సొరంగ మార్గంలోని 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల ప్రాం తంలో మట్టిదిబ్బలు కూలి టన్నెల్ బోరింగ్ మెషిన్ వెనుక కార్మికులు శనివారం చిక్కుకున్నారని రెస్క్యూ టీం ప్రాథమికంగా గుర్తించింది. బృం దం ఇప్పటివరకు 12వ కిలోమీటర్ వరకు వెళ్లగలిగింది. కానీ.. ఆ ప్రాం తంలో నీటి ఊట, బురద పెద్ద సవాల్‌గా మారింది. సొరంగంలో ప్రస్తు తం 200 మీటర్ల మేర బురద పేరుకుపోయింది. తొలుత ర్యాట్ మైనర్స్ రెస్క్యూ బృందాన్ని నేరుగా సొరంగంలోకి పంపాలని సర్కార్ ప్రణాళిక రచించింది. కానీ.. మట్టిదిబ్బలు కూలి కిందపడుతుండడంతో బృందం ఆ ప్రయత్నాలను విరమించుకున్నది. కార్మికుల వద్దకు స్నిఫర్ డాగ్స్‌ను సైతం పంపించాలని బృందం యత్నించింది. ఆ ప్రయత్నాలు సైతం ఫలించలేదు. ప్రస్తుతం కన్వేయర్



బెల్ట్‌ను వినియోగించి బురదను బయటకు పంపించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. బృందం ప్రతి ఆరు గంటలకోసారి సొరంగంలోని ప్రమాద స్థలికి వెళ్లేందుకు యత్నిస్తు న్నారు. బృందం ఇప్పటివరకు ఏడు సార్లు సొరంగంలోకి వెళ్లేందుకు యత్నించి, మళ్లీ వెనక్కివచ్చింది. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్‌లో 584 మంది నిపుణులు పాల్గొంటున్నారు. కార్మికుల ఆచూకీ కోసం డ్రోన్లు, ఎండోస్కోపిక్ కెమెరాలు, వాకీటాకీలను వినియోగిస్తున్నారు. మరోవైపు సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు ప్రమాద స్థలికి చేరుకున్నారు. తమవారికి ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

## ప్రజల ప్రాణాల కంటే ఓట్ల వేటేముఖ్యమా

ఆర్తనాదాలు వినే టైం లేదా?

ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేటనేనా?

ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్న రేవంత్

సీఎంకేటీఆర్ తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది ఆచూకీ తెలియని విపతర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నారని, ఇది దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'జరిగిన ఘోర దుర్ఘటనపై ముఖ్యమంత్రికే సీరియస్ నెస్ లేకుంటే ఇక అధికార యంత్రాంగానికి ఎకడ ఉంటది ? సహాయ చర్యలు ఎలా ముందుకు సాగుతాయి?' అని సోమవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'జిల్లాలకు జిల్లాలు పర్యటిస్తూ ఓట్లవేట కోసం ముఖ్యమంత్రికి సమయం ఉన్నదిగాని, ఎస్ఎల్‌బీసీ సొరంగ బాధితుల ఆర్తనాదాలు వినేందుకు టైం లేదా? ఇందిరమ్మ రాజ్యం లో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా? ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా?' అని నిలదీశారు. ఎస్ఎల్‌బీసీలో సహాయక చర్యలు కొలికి రాకముందే, సొరంగంలో శకలాల కింద చిక్కినవారు బతికుండే అవకాశం కనిపించడం లేదని సరారు చేతులెత్తేసినట్టే కనిపిస్తున్నదని మండిపడ్డారు.

### ప్రమాదంపై మౌనమెందుకు బండీ?

'కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జల విద్యుత్తు కేంద్రంలో ప్రమాదంపై నానా యాగీ చేసిన బండి సంజయ్.. ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగి మూడు రోజులవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారు?' అంటూ కేటీఆర్ నిలదీశారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
మంగళవారం, 25 ఫిబ్రవరి, 2025

# బీఆర్ఎస్, బీజేపీ డీల్

(మొదటి పేజీ తరువాయి)

ఫైళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీసుకెళ్లిందని.. ఇప్పటివరకు ఆ కేసులు ఏమయ్యాయో ప్రజలకు చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదంతా పరోక్షంగా బీజేపీకి, బీఆర్ఎస్ మద్దతు ఇవ్వడం వల్లనే జరుగుతున్నదని, అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని నిలపలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు, ద్వేషం, అసూయతో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని, చీకటి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత.. ఓటు ఎవరికి వేస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని బీజేపీ నేతలు కిషన్ రెడ్డి ఈటల అడ్డుకుంటున్నారని అన్నారు. బీజేపీకి పట్టభద్రుల ఓటు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల, పట్టభద్రుల తరుపున పోరాడుతారని సీఎం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ దోరణి.. సత్రంలో ఉచితంగా భోజనం



పెడుతుంటే వెనకటికెవడో ఆ భోజనానికి కూడా నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ లెటర్ తెచ్చుకున్నటుందని సీఎం చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా నిలపెట్టలేకపోయిన బీఆర్ఎస్ రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని చెప్పడం హస్యస్పదంగా ఉందని అన్నారు. ఫాం హౌస్‌లో కూర్చొని కేసీఆర్ పొంకనాలు కొడుతన్నారని ఆయన అన్నారు. బూటులో రాయి తీసుకోలేని వాడు ఏటిలో ఉన్న పెద్ద బండరాయిని బయటికి తీస్తానని బయలుదేరినట్టుగా ఉంది కేసీఆర్ ధోరణి అని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంటే కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని, ఆయన ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తారని తెలిపారు. సంవత్సర కాలంలో ఉద్యోగులు, టీచర్లకు ప్రమోషన్లు, బదిలీలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. పదేళ్లలో టెట్, డీఎస్సీ నిర్వహించకుండా కేసీఆర్ ప్రభుత్వం తండాలలో, గ్రామాల్లో పాఠశాలలను మూసివేస్తే, సంవత్సర కాలంలోనే టెట్ నిర్వహించి, డీఎస్సీ నిర్వహించి 11 వేల మందికి ఉద్యోగాలిచ్చామని అన్నారు. 5 లక్షల మందికి ఉద్యోగులకు 20వ తేదీ వరకు కూడా జీతాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల మొదటి తారీఖునే జీతం ఇస్తున్నామని సీఎం చెప్పారు.

# దస్ పర్సంటేజ్ సర్కారు: కవిత

(మొదటి పేజీ తరువాయి)

వారికే బిల్లులు మంజూరవుతున్నాయని ఆమె ఆరోపించారు. మహబూబాబాద్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో నడుస్తోందని, మొదటి పీ- ఫోబియా, రెండో పీ- పాలిటిక్స్ అని, మూడో పీ- పర్సంటేజ్ అని వివరించారు. సీఎం సొంత జిల్లాలో టన్నెల్ కూలిపోతే సీఎం అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాల్సింది పోయి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి పోయారని విమర్శించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి పోయి మద్దతు ధర పై కొట్లాడుతుంటే రేవంత్ మాత్రం రైతుల పరిస్థితిని పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం సాయంత్రం వేళ కేసముద్రం మార్కెట్ మిర్చి యార్డును కవిత సందర్శించారు. గతేడాది క్వింటా రూ.25 వేలు అమ్మిన మిర్చి ఈసారి రూ.11 వేలకు పడిపోయిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు పట్టుకొనైనా మిర్చికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

# యూరియా సప్లులో సర్కార్ విఫలం

## రైతుల ఎరువుల కష్టాలు తీర్చండి.. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రైతుల అవసరాలకు తగినంత యూరియా సప్లై చేయడంలో సర్కార్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం 'ఎక్స్'లో మండిపడ్డారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతున్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీకి పోలీసులు టోకెన్లు జారీ చేశారని, ఇదెక్కడి చోద్యమని ప్రశ్నించారు. తాజాగా జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇలాగే రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ ఆ రోజులు తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో రైతు రారాజుగా ఉండేవాడని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతును నట్టేట ముంచుతున్నదన్నారు. రైతు డిక్లరేషన్, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరిట సర్కార్ రైతులను మోసం చేసిందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట నీరు పెట్టించడం మంచిది కాదని హితవు పలికారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# ఉప ఎన్నికలు రాబోతున్నాయి: ఎంపీ లక్ష్మణ్



**నల్లగొండ:** తెలంగాణలో ఉప ఎన్నికలు రాబోతున్నాయని ఆసక్తికర కామెంట్స్ చేశారు బీజేపీ ఎంపీ లక్ష్మణ్. ముఖ్యమంత్రి రేవంత్ నీ పని అయిపోయింది.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుతో ముడిపడినవి అంటూ చెప్పుకొచ్చారు. నల్లగొం డలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'తుమ్మితే ఊడిపోయే ముక్కులా తెలంగాణ, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి. రేవంత్‌నీ పని అయిపోయింది. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు. 14 నెలలుగా విద్యార్థుల నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగుల వరకు రేవంత్ ప్రభుత్వం వారిని రాచి రంపాన పెడుతోంది.

# మళ్లీ గట్టు దాటి.. మల్లన్న హాట్ కామెంట్స్



**కరీంనగర్:** అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న రగడ కొనసాగుతోంది. ఒకవైపు నవీన్‌ను పార్టీ నుంచి బహిష్కరిం చాలనే గొంతుకలు పెరుగుతున్న వేళ.. ఆయన మరింత రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చినా కూడా తగ్గేదేలే అంటున్నారు. తాజాగా.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ది, తనది వేర్వేరు దారన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికి మద్ధతుగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల బృందంతో ఇవాళ కరీంనగర్‌లో సభకు హాజరవుతున్నారు. అయితే అంతకంటే ముందే.. అదే కరీంనగర్ వేదికగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ హాజరైన బీసీ జేఏసీ మీటింగ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ప్రత్యక్షం కావడం, తాజా పరిణామాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. "జానారెడ్డి కళ్లల్లో ఆనందం కోసం చిన్నారెడ్డి నాకు షోకాజ్ నోటీస్ పంపించారు. నేను ఈ బీసీ జేఏసీ సమావేశానికి వస్తే ఓ పార్టీ అభ్యర్థి బాధపడుతున్నారు. మరి అదే అభ్యర్థి.. నాకు షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పుడు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదు?" అని ఎమ్మెల్సీ నవీన్ నిలదీశారు. .. రాహుల్ గాంధీ స్పిరిట్‌తోనే బీసీ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నా. కానీ, నేను ఇలా చేయడం కాంగ్రెస్‌లో మరి కొన్ని వర్గాలకు నచ్చడం లేదు. మీకు పడకపోతే నేను బీసీ ఉద్యమాన్ని ఆపుతానా?.. ఇస్సా, ఇజ్జత్, హుకూమత్ కోసమే బీసీ ఉద్యమమం అంటూ తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్ చేశారు.

## డాక్టర్ సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం కేసు ..

# దారి తప్పిన భార్య కథ



**హైదరాబాద్:** వాళ్లిద్దరూ భార్య భర్తలు. ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. దంపతులిద్దరూ సమాజంలో గౌరవప్రదమైన డాక్టర్, లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. అయితే, లెక్చరర్‌గా విద్యాబుద్ధులు నేర్పించే భార్య పక్కదారి పట్టింది. దారుణానికి ఒడిగట్టింది. తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చేందుకు ప్లాన్ చేసింది. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. ముందస్తు ప్లాన్ ప్రకారం, అనుకున్నట్లుగా భర్త చనిపోకపోవడంతో చివరికి పోలీసులకు పట్టుబడింది. దోషిగా కటకటాల్లోకి వెళ్లనుంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వరంగల్ డాక్టర్ సుమంత్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనలో అసలు సూత్రదారి, పాత్రదారి బాధితుడి భార్య ఫ్లోరా మరియా అని తేలడం అందర్నీ షాక్‌కు గురి చేసింది. మంగళవారం నిందితులను పోలీసులు మీడియా ఎదుట హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. పోలీసుల వివరాల మేరకు, డాక్టర్ సుమంత్ రెడ్డి, ఫ్లోరా మరియాలు ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కాజీపేటలో సుమంత్ క్లినిక్‌ను నిర్వహిస్తుండగా, అతని భార్య ఫ్లోరా మరియా రంగశాయిపేటలో డిగ్రీ లెక్చరర్‌గా పనిచేస్తోంది. అయితే, క్లినిక్ ప్రారంభించకముందు ఓ ఆస్పత్రిలో డాక్టర్‌గా సుమంత్ పనిచేసేవారు. ఆ సమయంలో ఫ్లోరా మరియా ఓ జిమ్‌లో చేరింది. అక్కడే ఆమెకు సామేల్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. ఆ విషయం సుమంత్‌కు తెలిసిపోవడంతో భార్య ఫ్లోరాను మందలించాడు.

# పెట్టుబడులతో వస్తే ప్రభుత్వ సహకారం

లైఫ్‌సైన్సెస్, ఫార్మా, బయో-టెక్ రంగాల్లో అగ్రగామి తెలంగాణ
అమ్జెన్ కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
లైఫ్‌సైన్సెస్, ఫార్మా, బయో-టెక్ రంగాల్లో అగ్రగామి తెలంగాణ
ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధించడమే లక్ష్యం




**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు సహకార మందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో సోమవారం ఆయన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బయోటెక్నాలజీ కంపెనీ అమ్జెన్ కంపెనీ ఇన్నోవేషన్, టెక్నాలజీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పరిశోధనలు, నైపుణ్యాల అభివృద్ధి, విద్యా రంగాల్లో పెట్టుబడులను తమ ప్రభుత్వం ఆహ్వానిస్తున్నదని తెలిపారు. రాష్ట్రం ఇప్పటికే లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయో-టెక్ రంగాల్లో అగ్రగామిగా ఉందని, ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధించే లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగుతున్నదన్నారు. 'అమ్జెన్' కార్యకలాపాల విస్తరణతో హైదరాబాద్ బయోటెక్ హబ్ మారనున్నదన్నారు. తాను గతేడాది ఆగస్టులో శాన్ ఫ్రాన్సిస్కోకు వెళ్లానని, ఈ సందర్భంగా తాను అక్కడి అమ్జెన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించానని గుర్తుచే సుకున్నారు. దిగ్గజ అమ్జెన్ సంస్థ హైదరాబాద్‌కు రావడం అభినందనీయమన్నారు. స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్, అమ్జెన్ చైర్మన్, సీఈవో రాబర్ట్ ఏ బ్రాడ్వే తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ బ్రాండ్‌ను పెంచుతాం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతున్నదని, నగర బ్రాండ్‌ను మరింత పెంచేలా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఐటీమంత్రి దుద్దళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉండడంతోనే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయమన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపిటల్‌గా మారుస్తామన్నారు. ఆరోగ్య రంగంలోనూ సిటీని నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కేపాబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ హబ్‌గా మారిందని కొనియాడారు. మానవ వనరుల కేంద్రంగా తెలంగాణను మార్చేందుకు స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో యువతకు ఉద్యోగాలు దక్కేలా కోర్సులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ క్యాంపస్‌లో ఏడాది చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 600, రాబోయే రోజుల్లో 2 వేల మందికి చేరుతుందన్నారు. అమ్జెన్ భాగస్వామ్యంతో బయోటెక్నాలజీ రంగంలో నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేస్తామన్నారు.

### రూ.1600 కోట్ల పెట్టబడులు..

అమ్జెన్ కంపెనీ తమ కంపెనీ విస్తరణలో ఈ ఏడాది దాదాపు రూ.1,600 కోట్లు పెట్టుబడి పెడుతోంది. తద్వారా బయోఫార్మా రంగంలో భారీ ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఏఐ, డేటా సైన్స్ డిజిటల్ సెగ్మెంట్‌లో ఇన్నోవేషన్ సైట్‌గా సంస్థ అభివృద్ధి చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సంస్థ వంద దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థ పరిధిలో అన్ని దేశాల్లో కలిపి 28 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సంస్థ 4 దశాబ్దాలుగా సంక్లిష్టమైన వ్యాధులను నయం చేసేందుకు ఔషధాలు తయారు చేస్తోంది. క్యాన్సర్, గుండె వ్యాధులను నయం చేసేందుకు ఔషధాలను తయారుచేస్తోంది.

# బీఆర్ఎస్ స్కాంలను సీబీఐకిచ్చే దమ్ముందా?



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ- రేస్, గొర్రెల స్కాం, కాళేశ్వరం, కేటీఆర్ బామ్మర్ది పార్టీలో డ్రగ్స్ దొరికిన కేసులను సీబీఐకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ లేఖ రాస్తే.. ఆయా కేసుల్లో దోషులెవరైనా అరెస్ట్ చేసి జైల్లో వేయించే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోరకుండా, న్యాయస్థానాల ఆదేశాలు లేకుండా.. సొంతంగా విచారణ జరిపే అధికారం సీబీఐకి లేదని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసీ.. సీఎం స్థాయి వ్యక్తి కేంద్రంపై బురద జల్లడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. "ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, గొర్రెల స్కాంలపై రేవంత్ వ్యాఖ్యలు చూస్తే... ముఖ్యమంత్రిగా ఆయనే ఉన్నారా? లేక మేమున్నామా? అనే సందేహం వస్తోంది. అధికారాన్ని చేతిలో పెట్టుకుని ఎందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందిస్తుంటే నవ్వొస్తుంది. ట్యాపింగ్ కేసులో నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోతే... కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సహా సూత్రధారులు తెలంగాణలోనే ఉన్నారు కదా? అన్ని ఆధారాలున్నాయని చెబుతూ రాధా కిషన్‌రావు సహా కొందరు అధికారులను అరెస్ట్ చేసి 10 నెలలు జైల్లో ఉంచిన మీరు.. కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయలేదు? పైకి తిడుతున్నట్లుగా నటిస్తూ కేసీఆర్ కుటుంబంతో చీకటి ఒప్పందాలు చేసుకున్నది మీరు కాదా? ఒకవైపు మీరు విచారణ చేస్తూ.. మమ్మల్ని అరెస్టు చేయమంటారా?" అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతారని రేవంత్‌కు భయం పట్టుకుందని సంజయ్ అన్నారు. "ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ చేసిన ప్రసంగమంతా అబద్ధాలు, అర్ధ సత్యాలే. కాంగ్రెస్ ఓటమి ఖాయమనే భయం ఆయనలో కనిపిస్తోంది. ఇంటెలిజెన్స్ సహా సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చేశాయి. కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందన్న నివేదికలతోనే సీఎం హడావుడిగా ప్రచారం ప్రారంభించారు. చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. రేవంత్ మాత్రం ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. డబ్బు, అధికారాన్ని ఉపయోగించి.. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు.' అని సంజయ్ ఆరోపించారు.

# బీఆర్ఎస్‌తో రేవంత్ కుమ్మక్కు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని ఆరోపించారు. ఈ కేసులో అరెస్టయినవాళ్లు బెయిల్ తీసుకుని దర్జాగా బయటకు వస్తుంటే.. రేవంత్ అసమర్థతను బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని బీజేపీ హైకోర్టును ఆశ్రయించిందని గుర్తుచేశారు. ఈ కేసును రేవంత్ వదిలిపెట్టినా తాము వదలిపెట్టబోమని తేల్చిచెప్పారు. ఈ కేసును సీబీఐకి అప్పగిం చాలని.. దర్యాప్తు ఎలా ముందుకెళ్లదో తాము చూస్తామని ప్రకటించారు. మజ్లిస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీ, దేశ వ్యతిరేక శక్తులతో చీకటి ఒప్పందాలు చేసుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. "మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఒకదాంట్లోనే పోటీచేస్తున్న మీరు.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైందంటున్నారు.. మరి మిగతా రెండింటిలో ఎవరు ఎవరితో కుమ్మక్కైనట్లు..?" అని రేవంత్‌ను నిలదీశారు. రేవంత్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి భయం పట్టుకుందని.. ఆయన ఎవరిని విమర్శించారో, ఎందుకు విమర్శించారో అర్థం కాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఆర్ఆర్ఆర్, టెక్స్‌టైల్ పార్క్ తెచ్చింది నేనే.:** మూసీ ప్రక్షాళనకు కేంద్రం అనుమతి ఎందుకని సీఎంను ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని కానీ, పేదల ఇళ్లు కూల్చివేయవద్దన్నదే తమ విధానమని తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డును, రేవంత్ సీఎం కాకముందే తాను మంజూరు చేయించానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కానీ, ఆ ప్రాజెక్టును తానే అడ్డుకుంటున్నానని రేవంత్ ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. టెక్స్‌టైల్ పార్కు, రీజినల్ రింగ్‌రోడ్డును తెచ్చింది తానేనని కిషన్‌రెడ్డి చెప్పారు. ముస్లింలను బీసీల్లో చేర్చేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని.. అది బరాబర్ తప్పేనని అన్నారు. మతాన్ని తీసుకువచ్చి బీసీల్లో కలపడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రేవంత్‌లా తాను పార్టీలు మారలేదని.. కోర్టులు, జైళ్లు, పార్టీలు, నాయకుల చుట్టూ తిరగలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, పనిచేస్తున్న తనను విమర్శించే హక్కు రేవంత్‌కు లేదన్నారు. సోనియాను దెయ్యమన్న రేవంత్.. ఆ తర్వాత దేవత అంటూ ఆమె కాళ్లు పట్టుకున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి ఎవరో తిడితే, ఆదరబాదరగా ప్రచారానికి వెళ్లి తనపై, బండి సంజయ్‌పై రేవంత్ విరుచుకుపడ్డారని విమర్శించారు. 14 నెలల్లో తెలంగాణ స్వర్గమైనట్లు మాట్లాడుతున్నారని.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా..? అని కిషన్‌రెడ్డి నిలదీశారు.

### ఫీజులు, ఉద్యోగుల బకాయిలు చెల్లించండి..

**న్యూఢిల్లీ/నల్లగొండ టౌన్:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,500 కోట్లకుపైగా పేరుకుపోయాయని.. డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాషమెంట్‌కు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి ఉన్నాయని చెప్పారు.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 20న

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుంచికూడా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్ర శాసన మండలిలో ఎమ్మెల్సీలుగా ఉన్న మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, షేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేషం, మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండిల పదవీకాలం మార్చి 29న ముగియనుంది. ఎమ్మెల్యేల కోటాలో ఈ ఐదు స్థానాలను మార్చి 24లోపల ఎన్నికలు నిర్వహించి భర్తీ చేయాల్సి ఉంది.

# అభివృద్ధి చేతకాక, అక్కసుతోనే సుధీర్‌రెడ్డి విమర్శలు: మధుయాష్కీ గౌడ్

**గెలిపించిన కాంగ్రెస్ పార్టీని, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర సుధీర్ రెడ్డిది**

**జీవో నెంబర్ 118, ఇసుక లారీలు అడ్డపై మోసం చేసింది సుధీర్ రెడ్డి కాదా..?**

**అభివృద్ధిపై మాట్లాడే అర్హత ఆయనకు లేదు**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి..**



ఎల్ బి నగర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ టికెట్ మీద గెలిచి గెలిపించిన ప్రజలను కాంగ్రెస్ పార్టీని వెన్నుపోటు పొడిచిన నీతి, నిజాయితీ లేని నీతిమాలిన వ్యక్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు విషయంలో ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు నేపథ్యంలో మధుయాష్కీ జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, స్టాండింగ్ కమిటీ మెంబర్ సుజాత నాయక్ , కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి ల తో కలిసి వనస్థలిపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని మూసిలో బురద తీస్తానని కాంగ్రెస్కు వెన్నుపోటు పొడిచి టిఆర్ఎస్ లో చేరాడని.. మూసి కార్పొరేషన్ చైర్మన్గా సుధీర్ రెడ్డి చేసిందేమీ లేదన్నారు. తిరిగి కాంగ్రెస్ లో చేరేందుకు ఢిల్లీలో అధిష్టానం దగ్గర చక్కర్లు కొట్టడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళ్ళ వేళ్ళపడడం చేశాడని విమర్శించారు. జీవో 118 పేరుతో ప్రజలకు పనికిరాని డాక్యుమెంట్ చేతిలో పెట్టి ప్రజలను మోసం చేసిన చరిత్ర సుధీర్ రెడ్డిది,గత ప్రభుత్వానిదని విమర్శించారు.

అభివృద్ధి చేతకాక, హామీలతో ప్రజలను మోసం చేసి అసమర్థతతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను సుధీర్ రెడ్డి ప్రజలకు మోసం చేసింది నిజం కాదా..? ఓట్లు వేయించుకొని వెన్నుపోటు పొడిచినట్లు కాదా..? అని ప్రశ్నించారు. ఇసుక లారీల అడ్డాను టీజీఐఐసీ స్థలంలోకి తరలించి ఉచితంగా పార్కింగ్ సదుపాయం కల్పిస్తామని లారీ యజమానులకు చెప్పిన సుధీర్‌రెడ్డి. ఇప్పుడు ప్రైవేటు వారికి ఆ స్థలాన్ని కేటాయించి లారీ యజమానులను మోసం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హాయంలోనే పార్కింగ్ టెండర్లు పిలవటం. ఆ టెండర్లో సుధీర్‌రెడ్డికి చెందిన అనుచరుడితో టెండర్ వేయించింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. ఇలా జీఓ నం.118 ద్వారా, లారీల పార్కింగ్ ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపు ద్వారా ప్రజలను సుధీర్‌రెడ్డి కళ్ల ముందు మోసం చేశాడని ఆరోపించారు.

అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై జిల్లా ఇన్చార్జి 'మంత్రి శ్రీధరాబాబు పేరు పెట్టకుండా స్వార్థబుద్ధితో పనులు ప్రారంబించిన వ్యక్తి సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు జిల్లా ఇన్చార్జి మంత్రి ని అధికారులు వారి ప్రోటోకాల్ ప్రకారం పిలుస్తారు. దాంట్లో కాంగ్రెస్ నాయకుల జోక్యం ఉండదనే సోయి కూడా ఎమ్మెల్యేకు లేదా..? అని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు మంత్రి తో పాటు ఎమ్మెల్యేని కూడా ప్రోటోకాల్ పాటించే పార్టీ తమదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నెలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## షాదీ ముబారక్ /కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

ఖైరతాబాద్ మండల కేంద్రం లో రహమత్ నగర్ డివిజన్ కు చెందిన కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ లబ్దిదారులకు కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి , ఆర్ డి ఓ సాయి రామ్ , తాసిల్దార్ నయీముద్దీన్ గారితో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని పేద ప్రజలకు అండంగా ఉండే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమ లో బోరబండ కార్పొరేటర్ సతీమణి హబీబ సుల్తానా.డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గాలక్సీ లేజర్ సర్జరీ హాస్పిటల్ ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీలోని రోడ్ నెంబర్ 4లో గాలక్సీ లేజర్ సర్జరీ హాస్పిటల్ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యజమాని డాక్టర్ సుభాకర్, సుజిత్ కుమార్ ఆహ్వానం మేరకు బండి రమేష్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రవీణ్, నళిని కాంత్, శివ చౌదరి, బచ్చు మళ్ళీ, ఫణి కుమార్, బాలరాజు, నయీమ్ పాల్గొన్నారు.

## నీరా కేఫ్‌ను తొలగిస్తే చూస్తూ ఊరుకోం...

**ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, లేదంటే ఉద్యమం తప్పదు...**

**నీరా కేఫ్ భవనాన్ని గీత కార్పొరేషన్ సంస్థ కు అప్పజెప్పాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్..**



సికింద్రాబాద్ ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి: నీరా కేఫ్ అంటే గౌడు ల ఆత్మ గౌరవమని, 30 లక్షల మంది గౌడ ఆత్మ గౌరవం నీరా భవనం తో ఇమిడి ఉందని, నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ ను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని, తక్షణమే ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ లేదంటే ఉద్యమం తప్ప దనీ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కల్లుగీత సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ వద్ద నిరసన చేపట్టాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్..గౌడ కులస్తులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వేలం పాటతో మా ఆత్మ గౌరాన్ని మంట కల్పుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంప్రదాయక వృత్తిని పకృతి సిద్ధమైన పానీయాన్ని నీరగా మార్చి ప్రజల ఆరోగ్యానికి అందిస్తున్న గౌడ యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం కోసమే ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ లో ఉన్న వృత్తికి సంబంధించిన నమూనాలను తొలగించి టూరిజం హెటల్ గా మార్చడం దుర్మార్గమన్నారు. తక్షణమే వారం రోజుల లోపు నీరా కేఫ్ భవనాన్ని గీత కార్పొరేషన్ సంస్థ కు అప్ప జెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లక్షలాది గౌడ జన సమూహంతో గౌడలమే భవనాన్ని సొంతం చేసుకుంటామని హెచ్చరించారు. కులవృత్తుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని అన్ని కుల వృత్తులను ఏకం చేసి ప్రభుత్వాన్ని కూలగొడతామన్నారు. గౌడ కులస్తులను కుల వృత్తులను రాజకీయ నాయకులు పోలీసులు ఎవరు వేధించిన వేటాడు తామని హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నేడు మంగళవారం గౌడ సంఘాలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ, చలో హైదరాబాదు తేదీని ప్రకటిస్తామని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలుకట్టే విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి సాయన్న, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, అంబాల నారాయణ గౌడ్, ఆయిలి వెంకన్న గౌడ్, పంజాల జైహింద్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, కిషోర్ గౌడ్, సదానందం, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఝలక్

**బాలానగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన యూత్ కాంగ్రెస్**

**కాంగ్రెస్ యూత్ నాయకుడు మధు ఆధ్వర్యంలో 100 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరిక**

**గులాబి కండువా కప్పి బీఆర్ఎస్ లో స్వాగతించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కాంగ్రెస్ పార్టీలో అభివృధి శూన్యం ..... మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమే కావాలంటూ బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ యూత్ నాయకులు, కార్యకర్తలు**



కూకట్ పల్లి, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీకి చెందిన పలువురు భారీగా యువజన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలలో అధికారం కోసం అబద్దాల హామీలు ఇచ్చి, తప్పుడు ప్రచారాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిదని, అందుకే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వం మళ్ళీ రావాలని బీఆర్ఎస్ లో చేరుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజక వర్గంలోని బాలానగర్ డివిజన్ లో గిరి సాగర్ రాజు సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు మధు ఆధ్వర్యంలో వందమంది యువకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. యువకులందరికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి స్వాగతించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని, కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన 14 నెలల్లో నియోజకవర్గానికి మొండిచేయ్యే చూపిందని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తామని మహిళలకు రెండు వేల ఐదు వందలు, పెన్షన్లు 4వేలు రూపాయలు అందిస్తామని తప్పుడు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయని అందుకే కాంగ్రెస్ పార్టీ యువకుల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మధు మాట్లాడుతూ ఏదో జరుగుతుంది కాంగ్రెస్ ఎంతో అభివృధి చేస్తారని ఊహించమని కానీ మాటలకే పరిమితమయ్యారు తప్ప కాంగ్రెస్ పార్టీ అభివృధి చేయలేదని తేలిపోయిందని అందుకే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృధి చెందాలంటే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని మధు అన్నారు.



## ప్రతిక్షణం ప్రజా సేవ కోసం పాటుపడుతా: కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు..అనంతరం పలు ఆహ్వానాలు,వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు..ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ..ప్రతిక్షణం ప్రజా సేవ,ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతా అన్నారు..నిరంతరం నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు,సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)**

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే) : రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయి. అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సోమవారం రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా కింది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

**సమస్యలు:** ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలి. జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలి.కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి. ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలి. జర్నలిస్తుల కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వమే భరించాలి. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలి.కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసింది. వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలి.ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలి.

రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలి. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలి.అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలి. జర్నలిస్టుల దయనీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే పై సమస్యలను పరిష్కరించేలా మీరు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతున్నాం.




## ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా కాపాడుకుంటాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 453, 454లోని చిన్న చెల్క భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటూ ఏర్పాటు చేసిన బోర్డులతో తీవ్ర గందరగోళానికి గురైన రైతులు దుండిగల్ లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరై రైతులు సాగు చేసుకునే భూమిలో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చిస్తామని, ఏ ఒక్క రైతు కూడా అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... 50 ఏళ్ల క్రితం సాగు కోసం నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, ఈ 453, 454 సర్వే నెంబర్లలోని రైతులల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని అన్నారు. రైతుల భూములను చట్టపరంగా రక్షించుకుందామని, రైతుల భూముల పరిరక్షణలో రాజకీయాలకతీతంగా పోరాడేందుకు తాను సిద్ధమన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్లు, రైతులతో కలిసి దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే తహసిల్దార్ తో సమస్య తీవ్రతపై చర్చించారు.

### రైతులకు పూర్తిస్థాయి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి

ఎమ్మార్వో ను ఆదేశించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దుండిగల్ గ్రామంలోని సర్వేనెంబర్ 453, 454 లలోని భూములు, రైతులకు సంబంధించిన వివరాలను పూర్తిగా సేకరించి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ, జక్కుల విజయ శ్రీనివాస్, ఆనంద్, మాజీ ఎంపిటీసీ బండారి మహేష్, వెంకటేష్, నాయకులు వీరాస్వామి, కె.వెంకట్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## సామాజిక సాంస్కృతిక మేధావులను ప్రభావితం చేసే కార్యక్రమాలు ఉండాలి

### ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి అబ్బాస్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి: ప్రస్తుత పరిస్థితులలో సామాజిక సాంస్కృతిక మేధావులతో ప్రభావితం చేయగలిగే కార్యక్రమాలు ఉండాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి అబ్బాస్ అన్నారు. బహుముఖ కార్యకలాపాలకు కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అని ప్రజా జీవితంలోని అన్ని పార్శ్యాలను స్పృశించే బహుముఖ కార్యకలాపాలకు కేంద్రంగా పని చేయాలని సూచించారు. తెలంగాణ ప్రజా సంస్కృతి కేంద్రం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం రోజు బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీ పీ ఎస్ కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్బాస్ హాజరై మాట్లాడుతూ అనేక కార్యక్రమాలతో పాటు బహుముఖ కార్యకలాపాల కేంద్రంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఉండాలని అన్నారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి 6 న ఆధ్యాత్మిక రంగం కృషి భజన కోలాటం కళాకారులు అనే అంశంపై రాష్ట్ర వర్క్ షాప్ హైదరాబాద్ ఎం బి భవన్ లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక రంగంలో పనిచేసే కార్యకర్తలందరూ జిల్లాకు ముగ్గురు చొప్పున హాజరుకావాలని కోరారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం షిరోస్ అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి రాములు, కార్యదర్శి హిమబిందు, జి.యాదగిరిరావు, కురుమూర్తి, టి రమేష్,జి నరేష్, శ్రీమన్నారాయణ, సాంబరాజు, యాదగిరి పాల్గొన్నారు.



## విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలి

### రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 )వాయిస్ టుడే పత్రినిధి): విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి కమిషన్ తరపున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బహుజన ఫ్రంట్ ( డిబిఎఫ్ ) అధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ...డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా విద్య హక్కు కల్పించకపోతే దళితులు చదువుకు దూరమయ్యేవారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ మెరుగుపడాలంటే దానికి తగ్గట్టుగా బడ్జెట్ కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్ లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ప్రొఫెసర్ కె.లక్ష్మి నారయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది వేల పాఠశాలలను మూసివేతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యంవి పౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హమి ప్రకారం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 24- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు కేటాయించి తమ హామీని తామే తుంగలో తొక్కిందన్నారు. రానున్న బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాము బాబు నాయక్, పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు నాగరాజు, అనిల్, హరిష్, సాధిక్,దివాకర్, వివిధ సంఘాల నాయకులు మెట్ల శంకర్ మామిడి నారయణ, నర్సింగరావు, జనార్దన్,రఘునందన్,పులి కల్పన సువర్ణ,బాగ్య చుంచు రాజేందర్, దాసరి ఎగొండ,దుబాషి సంజీవ్,రవి పాల్గొన్నారు.



## చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి...

### కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాలలను రాజకీయంగా ఆర్థికంగా అణిచి వేస్తుంది

### తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ డిమాండ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి: తెలంగాణలో ఉన్న 4 లక్షల మంది మాలలను రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అణిచి వేస్తుందని తెలంగాణ మాల సంఘాల జేఏసీ మండిపడింది. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రోజు ట్యాంక్ బండ్ వద్ద గల సామ్రాట్ కాంప్లెక్స్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జేఏసీ నాయకులు బేర బాలకిషన్ (బాలన్న), చెరుకు రామచందర్ లు హాజరై మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు అనేక పోరాటాలు చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వస్తే మాలలను పూర్తిగా అనిణివేచే ధోరణితో కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ అంశంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్దామంటే మాల ఎమ్మెల్యేలు, జేఏసీ నాయకులకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని, అసలు పట్టించుకోవడమేలేదని మండి పడ్డారు. ఆదర భాదరగా మందకృష్ణ బ్లాక్మెయిల్ రాజకీయాలకు తల వంగి ఎస్సీ వర్గీకరణ చేస్తే రాష్ట్రంలో ఎస్సి ఉప కులాల మధ్య శాశ్వతంగా ఘర్షణ వాతావరణ ఏర్పడుతుందన్నారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలోనే ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి శాసన సభ్యుని కి ఎస్సీ వర్గీకరణ వల్ల జరిగే ప్రమాదాన్ని తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు సమగ్ర సమాచారంతో వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్సీలపై అధ్యయనం చేయడానికి వేసిన శామీమ్ అక్తర్ కమిషన్ రిపోర్ట్ పూర్తిగా తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. 30 సంవత్సరాలుగా వర్గీకరణ ఉద్యమం వల్ల ఎస్సీలు అత్యంత వెనుకబడిన మాల మాల ఉప కులాలు తీవ్రంగా నష్టపోయామని ఈ విషయాన్ని కమిషన్, ప్రభుత్వం గ్రహించి మాల మాదిగ మేధావులతో సుదీర్ఘంగా చర్చించాలని, ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జంగ శ్రీనివాస్, మంచాల లింగస్వామి, దాసరి విశాల్, రఘునాథ్, రాజేష్, నరసింహ, శ్రీహరి, గాదె కుమార్, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### విద్యా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి

### రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ శర్మ



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ లో అక్షయ విద్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ శర్మ అక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించారు. అదేవిధంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, యుసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, కూకట్ పల్లి డీసీ గంగాధర్, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, బాలానగర్ ఏసీపీ హన్మంత రావు, సీఐ నర్సింహా రాజు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మకు స్వాగతం పలికారు. అనంతం గాంధీ మాట్లాడుతూ అక్షయ విద్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సహకారంతో అక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ను ఎల్లమ్మ బండ ప్రాంతంలో ప్రారంభించుకోవడం సంతోషకర అన్నారు. ఇక్కడి ప్రాంత పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడు తుందని, ఈ చక్కటి సదావకాశాన్ని సద్వినియోగపర్చుకొని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గాంధీ తెలిపారు. అక్షయ విద్య ఫౌండేషన్ సేవలు అమోఘమని, పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపే కాంతి రేఖ అక్షయ విద్య ఫౌండేషన్ వారిని ప్రత్యేకంగా అభినదించారు. గత12 ఏళ్ల నుంచి అక్షయ విద్య ఫౌండేషన్ బడుగు, బలహీన వర్గాల పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తుందని, పేదవాళ్ల జీవితాలు విద్య ద్వారానే మారుతోందని ఒక వ్యక్తి గనుక చదువుకుంటే మూడు తరాల తల రాత మారుతుందనే సిద్ధాంతంతో వేలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తుందన్నారు. ఈ 12 ఏళ్లల్లో సాధించిన విజయాలను స్మరించుకుంటూ 500 మంది విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించారని తెలిపారు. విప్రో, గూగుల్, అలాగే ప్రభుత్వ రంగ సంస్థలైన పోస్టల్ డిపార్ట్మెంట్, డీ.ఎ.సీ లో ఉద్యోగాలు సాధించారని, ప్రతిష్టాత్మకమైన ఐఐటీ ఖరగ్పూర్ లాంటి విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని గాంధీ తెలిపారు. తల్లిదండ్రులు లేని, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి, వారి ఉన్నత చదువులకు స్కాలర్ షిప్ ను అందించడం, సాంకేతిక విద్యా నైపుణ్యాలు మెరుగుపరచడం కొరకు 200 కు పైగా ల్యాప్ టాప్ లను పంపిణీ చేశామని తెలిపారు. ఈ రోజు చదువులతో పాటు సాంకేతిక, నైపుణ్యాలను పెంపొందించుకుంటే విజయం సిద్ధిస్తుందని, ఆకాశమే హద్దుగా ప్రపంచం శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాల అస్త్రాలతో దూసుకుపోతుందన్నారు.

## విద్యార్థుల్లో అమోఘమైన ప్రతిభ దాగి ఉంది

### ఓల్డ్ సిటీ ఎమ్మెల్యే వాజిద్ హుస్సేన్

### ఘనంగా ఫోనిక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ మాసబ్ ట్యాంక్ అన్యువల్ ఫెస్ట్




సికింద్రాబాద్, ఫిబ్రవరి 24, (వాయిస్ టుడే ప్రతినిధి)బీ విద్యార్థుల్లో అమోఘమైన ప్రతిభ దాగి ఉందనీ, విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టు కున్నాయని అన్ని రంగాలలో వారికి శిక్షణ అందజేయాలని ఓల్డ్ సిటీ ఎమ్మెల్యే వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఫోనిక్స్ ఇంటర్నేషనల్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ మాసబ్ ట్యాంక్ బ్రాంచ్ వారు గ్రాండ్ యాన్యువల్ ఫెస్ట్ సోమవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఓల్డ్ సిటీ ఎమ్మెల్యే వాజిద్ హుస్సేన్, ఫోనిక్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ మహమ్మద్ ఆసిఫ్ ఖాన్ లు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫోనిక్స్ ఇంటర్నేషనల్ గ్రూప్స్ ఆఫ్ కు స్కూల్స్ కరస్పాండెంట్ ప్రసన్న, బోధనా, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నాం : ఎమ్మెల్యే ముఠా గోపాల్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి: ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. కవాడీగూడ డివిజన్ పరిధిలోని ఉన్ని కోటాలో కోటి 10 లక్షల వ్యాయంతో ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాల్ స్లాబ్ నిర్మాణ పనులను సోమవారం రోజు ఆయన ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉన్ని కోటాలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయనీ, ఏ చిన్న శుభకార్యం జరుపుకోవాలన్నా బయటకు వెళ్లాల్సి వస్తుందని, ఫంక్షన్ హాల్లో చేసుకోవాలంటే రెక్కాడితే గాని డొక్కాడని తమలాంటి వారికి భారమవుతుందని, తమకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. అందువల్లనే పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉంటున్న ఈ చోటే కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో ఉన్ని కోట వాసులు శుభకార్యాలు జరుపుకోవడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. జి ప్లస్ వన్ గా నిర్మాణం చేపడుతున్న కమ్యూనిటీ హాల్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి ఆరు నెలల్లో పూర్తి చేసి బస్తీ వాసులందరూ కమ్యూనిటీ హాల్ను కాపాడుకోవాలని ఆయన సూచించారు. శుభకార్యాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయికుమార్, వల్లాల శ్రీనివాస్ యాదవ్. మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్ గౌడ్, చిత్రాల నగర్ శ్రీహరి, వల్లాల రవి యాదవ్, రాజు యాదవ్, రాజేష్, నర్సింగ్, సురేష్, శివ, వెంకటేష్, కొండ్రు మాధవి, రూప, మంజుల, ఉన్ని కోటవాసులు బి ఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు







## ఉచిత వైద్య శిభిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు - ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉచిత వైద్య శిభిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్ పేట డివిజన్ లోని కుర్మబస్తీ లో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే బీ.పీ పరీక్ష చేయించుకోగా నార్మల్ ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.... పేదలు అధికంగా నివసించే బస్తీలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రింటర్స్ డే సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్ ఇతర సభ్యులను ఆయన అభినందించారు. జలంధర్ గౌడ్ మాట్లాడుతూ... మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రింటింగ్ మిషన్ ఆవిష్కర్త జోహన్నస్ గూటన్ బర్గ్ సంస్మరణార్థం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 24న ప్రింటర్స్ డే ను గత 16 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాన్ని దాదాపు 200 మందికి పైగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహంకాళి పోలీస్ ఇన్స పెక్టర్ పరశురాం, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బిఅర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్ కుమార్, నాగులు, పబ్బా ప్రకాష్, చంద్ర ప్రకాష్, వైద్యులు గౌతం, రాకేష్ గౌడ్, మీనల్ చంద్ర, సునీల్, రేయన్, రాజశేఖర్, సుచరిత, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, సభ్యులు ప్రసన్న, హరి కుమార్, శ్రవణ్, మహేష్, శివ కుమార్, వేణు, పూర్ణ చందర్, అభిలాష్, సుబ్బు, బస్తివాసులు దౌల్తాబాద్ రాజేందర్, మల్లికార్జున్, హర్షిత్, శౌర్యానంద్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని ఓయూ పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ధర్నా






## కేవలం ధనార్జనే ధ్యేయంగా ఓయూ అధికార యంత్రాంగం పనిచేస్తుంది: పృథ్వీతేజ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి : ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఇష్టానుసారంగా పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని సోమవారం రోజు ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల భవనం నుంచి ర్యాలీ చేపట్టి ఓయూ పరిపాలన భవనం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హైదరాబాద్ మహానగర కార్యదర్శి పృథ్వీ తేజ మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుండి వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు మెరిట్ ఆధారంగా ప్రతి సంవత్సరం సీటు సంపాదించి విద్యభ్యాసం కొనసాగిస్తుంటే, ఓ యు ఉన్నతాధికారులు పరీక్ష ఫీజుల పేరు మీద, రీవాల్యుయేషన్ ఫీజుల పేరు మీద, సప్లిమెంటరీ పరీక్ష ఫీజుల పేరు మీద, పెనాల్టీ లతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పేరుకే ప్రభుత్వ యూనివర్సిటీ అయినా ఫీజులు మాత్రం ప్రైవేట్ యూనివర్సిటీని తలదన్నే రీతిలో ఉన్నాయన్నారు.తెలంగాణలో ఏ యూనివర్సిటీ లో లేని విధంగా మూడింతలు విద్యార్థుల నుండి వేలాది రూపాయల పరీక్ష ఫీజులను వసూలు చేయడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరీక్ష ఫీజులను చూసుకుంటే ట్యూషన్ ఫీజులను మించిపోయేలా ఉండటం బాధాకరం అని, యూనివర్సిటీ అధికార యంత్రాంగం కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నట్టు స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. విద్యార్థుల పరీక్ష ఫీజుల మీదనే యూనివర్సిటీ ఆధారపడి నడుస్తుంది అంటే ప్రభుత్వాల నుండి వచ్చే నిధులను తేవడంలో అధికారులు విఫలం అయ్యారని విఫలమయ్యారన్నారు.

వెంటనే ఫీజులు తగ్గించే చర్యలు చేపట్టాలని, పరీక్ష నిర్వహణకు ఖర్చు ఎంత అవుతుందో అంతే విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులను తీసుకోవాలనీ, విద్యార్థికి కోర్సు పూర్తి అయినప్పటి నుండి నాల్గు సంవత్సరాల వరకు ఎలాంటి పెనాల్టీ లేకుండా పరీక్ష ఫీజు కట్టించుకొని పరీక్షలు రాయనివ్వాలని,రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేశాకే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ చింతకాయల ఝాన్సీ , స్టేట్ జాయింట్ సెక్రటరీ అలివెలి రాజు ,విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరి ప్రసాద్ , ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్ష , కార్యదర్శులు దృహన్ , శివ శంకర్ , విభాగ్ కన్వీనర్లు శ్రీనాథ్ , శ్యామ్ , సూర్య ప్రకాష్ , సిటీ




జాయింట్ సెక్రెటరీస్ భరత్ , ఆదిత్య రాష్ట్ర కార్య సమితి సభ్యులు పూజిత్, మహేష్, కృష్ణ జిల్లా కన్వీనర్లు విక్రమ్, బాలకృష్ణ ,నాగేష్,అఖిల్,చందు తదితరులు పాల్గొన్నారు.




## వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం చేయాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య

వాయిస్ టుడే తొర్రూర్ ఫిబ్రవరి 24 : వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన శాసనాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఫిబ్రవరి 24 సోమవారం రోజున మహబూబాబాద్ జిల్లా కమిటీ సమావేశం సంగం రాష్ట్ర కమిటీ సభ్యులు వంగూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని పెరమాండ్ల జగన్నాథం భవన్లో జరిగింది ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య మాట్లాడుతూ సమగ్ర శాసనం కోసం దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా పోరాడుతున్నది కార్మిక సంఘం నాయకులు సమగ్ర శాసనం పై ఒక చిత్తుప్రతిని ప్రవేశ పెట్టడం జరిగింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పరిశీలిస్తామని చెప్పి చట్టం చేయకుండా కాలయాపన చేసింది 1974లో కేరళలో వామపక్ష పార్టీల కృషి వల్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకొచ్చింది నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు కార్మికులు పోరాడితే తప్ప ఈ చట్టం రాదు గ్రామాలలో రిజిస్టర్ ద్వారా వ్యవసాయ కార్మిక పేరు నమోదు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి సౌకర్యం 57 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికులు 5000 రూపాయల పెన్షన్ ఆరోగ్య బీమా స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం సంక్షేమానికి ప్రత్యేక లేబర్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఉపాధి కూలీలకు ఆధార్ దేసు పేమెంట్ విధానం రద్దు చేయాలని ఉపాధి పనిలో పని దినాలు 200 రోజులకు పెంచి రోజుకూలి 600 రూపాయలు ఇవ్వాలని పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ పని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్స్ పెంపు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబు బాణాల రాజన్న సహాయ కార్యదర్శి చేపూరి గణేషు జిల్లా నాయకులు గొడిశాల వెంకన్న ఉప్పునపల్లి శ్రీనివాస్ గొల్లపెల్లి కృష్ణ తగరం తిరుపతి గుండా గాని మధుసూదన్ చింతల బిక్షపతి జక్కుల లింగన్న లింగోజు బ్రహ్మచారి, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 24 : ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అందుకు తప్పనిసరిగా,బాధ్యతగా డబ్బును పొదుపు చేసి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఆర్బీఐ వారి వారోత్సవాల్లో భాగంగా ఆర్థిక క్రమశిక్షణ వారోత్సవాలను నిర్వస్తున్నారు. ఆ కార్యక్రమం లో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ వారోత్సవాలు ఈ నెల 24 నుంచి 28 వరకు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా శ్రేయస్సు కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక క్రమశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ప్రథమ బాధ్యతగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హావేలి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిగొండ నూతన నాయబ్ తహశీల్దార్‌గా లక్ష్మి



ముదిగొండ మండలం ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ని ముదిగొండ మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా కె లక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు గతంలో సింగరేణి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమను కలవవచ్చు అని సూచించారు అలాగే మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ.. రెవెన్యూ పరమైన సమస్యలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపు సబ్బండ వర్గాల గెలుపు

## బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 24 : ఉపాద్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి నీలం సుధాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ నల్లబెల్లి మండల పరిధిలోని హైస్కూల్ల లో ప్రచారం నిర్వహించడం జరిగింది. అనంతరం నల్లబెల్లి మండల కేంద్రంలోని కారుణ్యజ్యోతి హైస్కూల్ ఆవరణలో ఉపాద్యాయులతో కలిసి కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాద్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నల్లబెల్లి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్లలోని ఉపాద్యాయులను కలిసి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు బలసర్చిన సబ్బండ వర్గాల అభ్యర్థి ఎస్ సుందర్ రాజ్ యాదవ్ గెలుపు బడుగు బలహీన వర్గాల గెలుపు అని అన్నారు. కావున బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉపాద్యాయులు మొదటి ప్రాధాన్యత



ఓటు 19వ నెంబర్ లో వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి సబ్బండ వర్గాల సత్తా చాటాలని డ్యాగల శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి నీల సుధాకర్ ముదిరాజ్, నల్లబెల్లి మండల నాయకులు తంగెళ్ళ భాస్కర్, కందుగుల కుమారస్వామి, రాజా సాహేబ్, బాబు లతోపాటు ఉపాద్యాయులు పాల్గొన్నారు.



## ఐయుఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ మహ్మద్ షకీల్‌కు ఘన సన్మానం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి : ఎంజీ యూనివర్సిటీ నల్గొండ స్టాండింగ్ కౌన్సెల్ మెంబర్గా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ మహ్మద్ షకీల్ నియమితులైన సందర్భాన్ని పురస్కరించు కుని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తెలంగాణ యూత్ ప్రెసిడెంట్, ఇంజనీర్ మీర్ హమీద్ అలీ యూత్ లీగ్ ఆజంపురా కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. హమీద్ అలీ మాట్లాడుతూ ఈ ఘటన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌కు ఒక ఘన విజయం అన్నారు. కార్యక్రమంలో యూత్ లీగ్ ఉపాధ్యక్షుడు ఖదీర్ అహ్మద్ ఉద్దీన్, సెక్రటరీ సయ్యద్ సైఫ్‌లు పాల్గొని మహ్మద్ షకీల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాగంటి గోపినాథ్ త్వరగా కోలుకోవాలి


### తలసాని శ్రీనివాస్ యాదవ్

జూబ్లీహిల్స్ 24 ఫిబ్రవరి( వాయిస్ టుడే): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ను మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. గచ్చిబౌలిలోని AIG (ఏఐజి) హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఏ ఐ జి హాస్పిటల్ కు వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకొని సాధారణ జీవితంలో లోకి రావాలని ఆకాంక్షించారు.



## గార్వి ఉత్సవాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జూబ్లీహిల్స్ 24 ఫిబ్రవరి( వాయిస్ టుడే): ఎల్లారెడ్డి గూడా లోని గార్మి ఉత్సవాలు చాలా ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అసదుద్దీన్ ఛైర్మన్ స్పోర్ట్స్ టిపిసిసి కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ నవీన్ యాదవ్ సయ్యద్ మహమ్మద్ హుస్సేన్ సయ్యద్ హాసిం అలీ జావిద్ హుస్సేన్.. మహమ్మద్ మజీద్.. ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారుద.



## తొర్రూర్ డిపోను సందర్శించిన కరీంనగర్ జోన్ డైరెక్టర్

వాయిస్ టుడే తొర్రూర్ ఫిబ్రవరి 24 : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బస్ డిపోను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుసుర్ షా ఖాన్ ఆర్ ఎం డి విజయ భాను మరియు డిప్యూటీ ఆర్ ఎం మాధవరావు తోరూర్ డిపోను వార్షిక పర్యవేక్షణలో భాగంగా సోమవారం డిపోను సందర్శించినారు. డిపోలోనే ఆయా సెక్షన్లను పరిశీలించినారు ఈ కార్యక్రమంలో తొర్రూర్ డిపో మేనేజర్ వి పద్మావతి, మరియు కరీంనగర్ జోన్ సీఐ బోజేష్ కుమార్, మరియు ఎం.ఎఫ్ విజయ్ కుమార్, ఎస్ టి ఐ రజిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఝాన్సీ రెడ్డి పరమార్శ

వాయిస్ టుడే- తొర్రూర్ ఫిబ్రవరి 24 : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు సోమవారం మండలంలోని మాటేడు గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు పరామర్శించిన వారిలో మాటేడు గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాతుక వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన దూదిమెట్ల ఐలయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకుంటామని తెలిపారు. యువజన నాయకులు లింగాల మురళి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంచు సంతోష్, మాటేడు మాజీ సర్పంచ్ వల్లపు వెంకన్న శోభ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం, 25 ఫిబ్రవరి 2025



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -24 ( వాయిస్ టుడే ): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణికి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్ లో కార్యాలయాలు ఏర్పాటు చేసిన వివిధ శాఖలు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ భవనాల వివరాల నివేదికను మంగళవారం సాయంత్రం లోగా అందజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన షేక్ అసీఫ్, తన కుమారుడు షేక్ సూరజ్ ను శ్రీ చైతన్య జూనియర్ కళాశాల లో చేర్పించి అనారోగ్య కారణంగా ఒక రోజులోనే ఇంటికి తిరిగి తీసుకొని వచ్చామని, కళాశాల వారు ఒక్క రోజుకు 15,500 ఫీజు కట్ చేసుకున్నారని, తనకు తన డబ్బులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఇంటర్మీడియేట్ జిల్లా అధికారికి రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. మధిర ప్రాంతానికి చెందిన కాటారపు జయరాజు తన కుమార్తె ఇంటర్ చదువుతుందని జనన ధృవీకరణ పత్రం కోసం రెండు నెలల నుంచి తిరుగుతున్నానని, తన కుమార్తెకి త్వరగా బర్త్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొర్సా ప్రభాకర్ తాము 1985 నుంచి పోడు భూములు సాగు చేసుకుంటున్నామని, 2022 లో తమకు మూడు ఎకరాల తొమ్మిది గుంటల భూమి ఆర్వోఎఫ్ఆర్ సర్వే వచ్చిందని, పట్టాదారు పాసు పుస్తకం మాత్రం ఒక ఎకరం 6 గుంటలకు మాత్రమే వచ్చిందని, మిగిలిన రెండు ఎకరాల మూడు గంటల భూమికి ఆర్వోఎఫ్ఆర్ పట్టా పాస్ బుక్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ పెనుబల్లికి రాస్తూ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి ఏ. అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ విధివిధానాలపై పిల్లలతో ప్రసంగాలు



ఖమ్మం ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే ): ఈ మాసంలో చిన్నపిల్లలు అయినప్పటికీ మనం మన శక్తి సామర్థ్యాల మేరకు రోజాలు పాటించాలని , నమాజులు ఆచరించాలని , దైవ సన్నిధిలో అధిక సమయం కేటాయించాలని ..." అంటూ పలువురు చిన్నపిల్లలు ప్రసంగాలు చేశారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జమాతే ఇస్లామి హింద్ అనుబంధ సంస్థ VB చిల్డ్రన్స్ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జాహెరా ఫాతిమా అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు కార్యక్రమంలో చిన్నపిల్లలతో ప్రసంగాలు చేయించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల విధి విధానాలు , జగ్నేకిరాత్ , రోజా , జకాత్, ప్రత్యేక నమాజులు ... తదితర అనేక అంశాలపై చిన్నపిల్లల చేత ప్రసంగాలు చేయించడం ద్వారా వారిలో రంజాన్ మాసం ప్రత్యేకత ఈ మాసంలో వచ్చే పర్వదినం ఘనత గురించి , అవగాహన కల్పించిన జమాతే ఇస్లామి హింద్ ఇంద్రానగర్ శాఖ అధ్యక్షురాలు హుస్సేన్ బీ ఉపన్యసించటం చిన్నపిల్లలో కూడా ఇస్లామిక్ సాంస్కృతి, సాంప్రదాయాలు అర్థమయ్యే విధంగా వివరించడం విశేషం. తెలుగులో అటు ఉర్దూలో కూడా ప్రసంగించే హుస్సేన్ బి చిన్నపిల్లలకు సైతం అర్థమయ్యే రీతిలో తెలియజేయడం విశేషం.

## అందుబాటులో రైతులకు సరిపడా యూరియా నిల్వలు

### పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో పర్యటించి రైతులతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ ఖాన్



ఖమ్మం బ్యూరో , ఫిబ్రవరి -24 ( వాయిస్ టుడే): రైతుల పంట పొలాలకు సాగు నీటి విడుదల సమయంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో పర్యటించి వ్యవసాయ పొలాల వెంబడి రెండు కిలోమీటర్ల వరకు నడుస్తూ రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, సాగు నీటి విడుదల షెడ్యూల్ ను సంబంధిత ఆయకట్టు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులకు తెలిపారు. టెయిల్ ఎండ్ విధానంలో సాగునీరు సరఫరా జరగాలని ముందుగా చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు విడుదల కావాలని అన్నారు. మండలంలో రైతులకు అవసరమైన మేర యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సహకార సంఘం వద్ద యూరియా నిల్వలు ఉండాలని, ఎప్పటి కప్పుడు నిల్వలను పరిశీలిస్తూ స్టాక్ విషయమై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పెద్ద రైతులతో ఇతర రైతులకు సాగు పద్ధతులు, వ్యవసాయ అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలు అవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు లాభసాటి పంట సాగు చేయాలని అన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులు పెంచుకుంటే మనకు ఆదాయం లభిస్తుందని కలెక్టర్ సూచించారు. రైతుల పిల్లలు ఎక్కడ చదువుతున్నారు, గ్రామంలో త్రాగునీటి సరఫరా, పాఠశాల, ఆసుపత్రి పనితీరు ఎలా ఉన్నది మొదలగు వివరాలను తెలుసుకున్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి

### పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి- 24 ( వాయిస్ టుడే ): రాబోయే ఇంటర్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 72, పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 97 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 6వ తారీఖున ఒక సెట్,10వ తారీఖున రెండవ సెట్ ప్రశ్నా పత్రాలు జిల్లాకు వస్తాయని, వీటిని ట్రెజరీ రూమ్ లో భద్రపరిచి, జిల్లాలో 6 రూట్ లలో ప్రశ్నా పత్రాల తరలింపు ఉంటుందని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాల తరలింపు సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉండాలని అన్నారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు 6 ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశామని, ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ లో సిట్టింగ్స్ స్క్వాడ్ ఉంటుందని, వీరందరికీ స్పష్టమైన ఆర్డర్స్ అందించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రశ్నా పత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను రవాణా శాఖ అధికారి ఏర్పాటు చేయాలని అన్నారు.

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద స్థానిక సంస్థల ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని అన్నారు. వేసవి కాలం నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రం వద్ద చల్లని త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిసి టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షలు ముగిసిన తర్వాత పోస్టల్ శాఖ ద్వారా జవాబు పత్రాలు సరిగ్గా పంపేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా క్లోస్డ్ కంటెయినర్ లలోనే జరగాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి త్రాగునీటి సరఫరా ఉండే విధంగా సంబంధిత మున్సిపల్ అధికారులు లేదా గ్రామీణ నీటి సరఫరా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, డి.పి.ఓ. ఆశాలత, ట్రాన్స్కో ఎస్ఇ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కళావతి బాయి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఆర్టిసి, విద్యుత్, మునిసిపల్, పోస్టల్, ట్రెజరీ, పోలీస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## 10వ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

### రాబోయే నెల రోజుల పాటు ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలి

### మోడల్ పాఠశాల, కళాశాల ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి -24( వాయిస్ టుడే): నూతన అంశాలను నేర్చుకోవాలనే ఉత్సుకత విద్యార్థులు అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెనుబల్లి మండలం, టేకులపల్లి గ్రామంలో పర్యటించి తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. 10వ తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని, ఉపాధ్యాయిని బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఉపాధ్యాయుడిలా 10వ తరగతి విద్యార్థులకు కలెక్టర్ సోషల్ స్టడీస్ క్లాస్ తీసుకున్నారు. బెంగాల్ విభజన, ఇండియా మ్యాప్, వాతావరణం వంటి పలు అంశాలను కలెక్టర్, చాక్ పీస్ తో బోర్డుపై బొమ్మలు వేస్తూ విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటి సాధన దిశగా నూతన అంశాలను నేర్చుకోవాలనే ఉత్సుకతను అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.రాబోయే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ తెలిపారు. మనం వీక్ గా ఉన్న సబ్జెక్టుపై శ్రద్ధ పెట్టాలని, గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నా పత్రాలను పరిశీలించి రెగ్యులర్ గా వచ్చే ప్రశ్నలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని అన్నారు. తరగతి గదిలో బాగా చదివే పిల్లలు కొంత వెనుకబడిన పిల్లలకు సహాయం చేయాలని, ఇతరులకు మనం ఒక అంశాన్ని బోధిస్తే ఆ అంశం మనకు బాగా గుర్తుంటుందని అన్నారు.

రాబోయే నెల రోజులపాటు విద్యార్థులు సెల్ ఫోన్, టీవీ లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయం పరీక్షలకు సిద్ధమయ్యేందుకే కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం సమయమ లేచి చదువు కోవాలని అన్నారు. పెట్రోల్ లేకుండా కారు నడవడం ఎలా సాధ్యం కాదో, అదేవిధంగా ఖాళీ కడుపులతో ఉంటే చదువు మెదడుకు ఎక్కదని, విద్యార్థులు తప్పనిసరిగా బ్రేక్ ఫాస్ట్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని అన్నారు. జీవితంలో ఎదురు దెబ్బలు సహజమని, అట్టి పరిస్థితులను ఎదుర్కొని లక్ష్యం దిశగా కృషి చేసిన వారే విజయం సాధిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాఠశాలలో టాయిలెట్స్ ఎలా ఉంటున్నాయి, రెగ్యులర్ గా క్లీన్ చేస్తున్నారా, మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా ఉంది, స్నాక్స్ ఏం ఇస్తున్నారు మొదలగు వివరాలను కలెక్టర్ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఇంకనూ కావాల్సిన వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పెనుబల్లి మండల విద్యాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ సుధీర్, ఎంపిడిఓ అన్నపూర్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపక దంపతుల పరిశోధనాంశానికి పేటెంట్



ఖమ్మం, ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే) : స్థానిక ఎస్.ఆర్ బి.జి.ఎన్.ఆర్ కళాశాల లో జువాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న బూర్గుల కవిత,జీవన సహచరుడు గతంలో కళాశాల కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేసి , ప్రస్తుతం తొర్రూరు కళాశాల లో పని చేస్తున్న డా.వడిగ శాంతి కుమార్ లకు కెలోట్రోపిస్ప్రోసెరా తెల్లజిల్లేడు మొక్క వేర్లనుండి తీసిన రసాయానాన్ని పలువిధాలుగా మార్పులు చేసి బయో లాజికల్ యాక్టివిటీస్ పెంచే అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయం జువాలజీ ప్రొఫెసర్ డా.ఇస్తారి మామిడాల ఆధ్వర్యంలో వీరికి పేటెంట్ హక్కు లభించింది. 2024 లోభారత పేటెంట్ కార్యాలయానికి సమర్పించిన నివేదిక ఆధారంగా ఈనెల 21 నా కె.యు వైస్ ఛాన్సలర్ నుండి సమాచార పత్రాన్ని అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అభినందన పూర్వక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా వారికి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్,ఏ.ఎల్.ఎన్.శాస్త్రి,డా.బానోత్ రెడ్డి,జువాలజీ విభాగాధిపతి, ఐ..క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, సీ.ఓ.ఈ డా.సత్యవతి, సీనియర్ అధ్యాపకులు డా.ఎన్.మాధవరావు, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ,డా.బి.శ్రీనివాస్,జువాలజీ సహా చార్యులు డా.చెంచురత్నయ్య,శరీన్, వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.



## బదిలీపై వెళ్లిన డీటీకి ఘనంగా వీడ్కోలు సన్మానం

ముదిగొండ మండలం ఫిబ్రవరి 24 వాయిస్ టుడే : ముదిగొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహశీల్దార్ గా విధులు నిర్వహించిన ఉసికల ఉపేందర్ ఖమ్మం ఎస్.వై.ఎస్.ఓ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్ (డిప్యూటీ తహశీల్దార్) గా బదిలీ పై వెళ్తున్న నేపథ్యంలో సోమవారం రెవిన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బందితో కలిసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా తహశీల్దార్ సునీతా మాట్లాడుతూ అనతి కాలంలోనే ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి మండల రెవిన్యూ సేవల్లో కీలక పాత్ర వహించారని అన్నారు బదిలీకి విచారం వ్యక్తం చేస్తూ, మళ్ళీ అవకాశం వచ్చినప్పుడు ముదిగొండ మండలానికి సేవలందించాలని కోరారు ఈ కొద్ది రోజుల్లోనే డిప్యూటీ తహశీల్దార్ ఉసికల ఉపేందర్ చేసిన అమూల్యమైన సేవలను తహశీల్దార్ మరియు రెవిన్యూ సిబ్బంది కొనియాడారు ఈ కార్యక్రమంలో ముదిగొండ నూతన డిప్యూటీ తహశీల్దార్ కె.లక్ష్మి,రెవిన్యూ ఇన్స్పెక్టర్ వహీదా సుల్తానా,ప్రసన్న కుమార్ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




ఖమ్మం ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్ లు చేస్తూ అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న నారాయణ,శ్రీచైతన్య ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి పి. డి. ఎస్. యూ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నారాయణ కాలేజీ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లుపాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమైంది. గల్లి గల్లికి మోడల్ స్కూల్స్ ,ఈ టెక్నో , ఫౌండేషన్ ,ఈ-టెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్చగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కాలేజీ పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే కాలేజీ లను రాన్ చేస్తూ కనీసం అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారు. రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నా అధికారులకు ఇవి కనిపించడం లేదా అని వారిని వారు ప్రశ్నించారు. కాలేజీ లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసీ రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది PROలను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కావున తక్షణమే విద్యాశాఖ అధికారులు,పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 24, (వాయిస్ టుడే): జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు పేరుక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఏవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేరుక రవి మాట్లాడుతూ. జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలని, జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలెక్నీ, లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలన్నారు. జర్నలిస్ట్ల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు మహమ్మద్ యూసుఫ్, వేములవాడ పట్టణ అధ్యక్షులు కొప్పుల ప్రసాద్, జిల్లా యూనియన్ నాయకులు తొగరి కరుణాకర్, మొహమ్మద్ షరీఫ్, శ్రీధర్, బిక్షపతి, వేణు, వెంకటస్వామి, ఆంజనేయులు, ప్రసాద్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## న్యూ లక్ష్మీపురంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

### డిప్యూటీ సీఎం భట్టికి కృత్ఞతలు తెలిపిన గ్రామస్తులు



ముదిగొండ, మండలం ఫిబ్రవరి 24 వాయిస్ టుడే: ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం డిప్యూటీ సీఎం భట్టి కి కరెంట్ పోల్స్ ఏర్పాటు కొరకు దరఖాస్తు చేసుకున్నారు వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం మంజూరు చేశారు న్యూ లక్ష్మీపురం లో మిడిల్ కరెంట్ పోల్స్, కొత్త పోల్స్ అవసరం ఉన్న చోట గ్రామస్తులు వేయించారు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి కి మరియు మండల విద్యుత్ శాఖ అధికారి ఎమ్.శ్రీనివాస్ కి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య,చెన్నయ్య,నాగరాజు, కొట్టె శ్రీనివాసరావు, ఊరుకొండ రాజు,బట్టు బసవయ్య, ఖాసీం బాబు,గ్రామ స్థాయి విద్యుత్ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ రోజున ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు

### ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు వెసులుబాటు



కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): ఈనెల 27న జరిగే ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల,ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు. వ్యాపార,వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్,అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు,కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి,వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు. ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు, డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరుకావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.ప్రత్యేక సాధారణ సెలవు, వెసులుబాట్లను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.



## ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఎండల తీవ్రత,జాగ్రత్త చర్యలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో నీటిని కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువసార్లు నీళ్లు తాగేలా చూడాలన్నారు.ప్రతి ఆరోగ్య కేంద్రంలో,అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని అన్నారు. వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి నిమ్మరసం అందించాల్సిందిగా నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయాల్సి వస్తే ఉదయం,సాయంత్రం వేళలో మాత్రమే నిలిపివేయాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వేసవిలో మొక్కలకు మల్చింగ్ చేసి సంరక్షించాలని సూచించారు.ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఏమి చేయాలో ఏమి చేయకూడదో సూచించే పోస్టర్లను జన సందోహం ఉండే ప్రాంతాల్లో అతికించాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్సులో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కిట్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎండ తీవ్రత కారణంగా మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడితే 108కి కాల్ చేయాలన్నారు. ప్రజలు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, మసాలా పదార్థాలు తగ్గించాలన్నారు.ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు,సూచనలు ఇవ్వాలని,అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ,జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,జిల్లా సంక్షేమ అధికారి సబిత,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన సీఎం



తిమ్మాపూర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన నిర్వహించిన పట్టభద్రుల సంకల్ప సభ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా సీఎంకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వాగతం పలికారు.సీఎం వెంట ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్,రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్,అడ్లూరి లక్ష్మకుమార్,పెద్దపల్లి, చొప్పదండి,జగిత్యాల, రామగుండం శాసనసభ్యులు సీహెచ్ విజయరమణారావు, మేడిపల్లి సత్యం,డాక్టర్ సంజయ్ కుమార్,రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, మాజీ ఎమ్మెల్సీ తానిపర్తి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీలు పురమల్ల శ్రీనివాస్,వొడితెల ప్రణవ్ రావు ఉన్నారు.



## నరేందర్ రెడ్డి గెలుపుతో నిరుద్యోగులకు ధీమా : ఎంఎల్ఏ కవ్వంపల్లి

మానకొండూర్,ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి గెలిస్తే నిరుద్యోగ పట్టభధ్రులకు అండగా ఉంటారని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.తిమ్మాపూర్ మండలం అల్గునూరు ఎస్వీ గార్డెన్స్ లో పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 27న జరగబోయే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్,మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేందర్ రెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తారన్నారు.నరేందర్ రెడ్డి ఉపాధ్యాయుడుగా కొనసాగుతూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలకు అధిపతిగా ఎదిగారని,తనవిద్యాసంస్థల ద్వారాఎంతో మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా అనేక మంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దిన ఘనత నరేందర్ రెడ్డికి దక్కుతుందన్నారు. అంతే కాకుండా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 5వేల మందికి నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి వారి జీవితాలను చక్కదిద్దారన్నారు.కష్టపడే తత్వం గల నరేందర్ రెడ్డి కష్టం విలువ తెలుసని, నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకోగలరన్నారు. నరేందర్ రెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అండతో పట్టభద్రుల సమస్యలన్నింటిని తీర్చగలుగుతారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి గుర్తు చేశారు.ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పాల్గొన్నారు.



## కేరళ హెల్త్ పాలసీ అమలు పరచాలి

### నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో కేరళ హెల్త్ పాలసీ తీసుకొని రావడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. గత ఎనిమిది సంవత్సరాలుగా బోడేపూడి విజ్ఞాన కేంద్రం, మరియు %జూవీ% పార్టీ ఖమ్మం టూ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో నడుస్తున్న నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపు తిరిగి మార్చి ఫస్ట్ తేదీ శనివారం జరగబోతున్న సందర్భంగా సోమవారం మెడికల్ క్యాంపు వాలంటీర్లు సమావేశం సుందరయ్య భవన్ లో జరిగింది సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సందర్భంలో అయినా లేదా మరే వేరే కొత్త వైరస్ రోగాలు వచ్చినా వాటిని సమర్ధవంతంగా తిప్పికొట్టడంలో గత పది సంవత్సరాలుగా కేరళ ముఖ్యమంత్రి విజయన్ లెఫ్ట్ ప్రభుత్వం ముందు వుంది అని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ హెల్త్ కేంద్రం వుంటుంది అని, జనరల్ డాక్టర్ తో ఉచితంగా టెస్ట్ లు కూడా గ్రామ పంచాయతీ హెల్త్ కేంద్రంలో వుంటాయని తద్వారా పేదలకు కార్పోరేట్ ఆస్పత్రులకు వెళ్ళాల్సిన అవసరం లేదు అని తెలిపారు. ముఖ్యమైన నగరాల్లో ఆధునిక వైద్యం కూడా ఉచితంగా అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసింది అని, ప్రధానంగా వైద్యుల కొరత, మందుల కొరత అక్కడ లేకుండా హెల్త్ రంగానికి తగిన నిధులు కేటాయించారు అని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రయివేటు ఆసుపత్రి ఆధిక బిల్లులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించి వైద్యం అనేది ప్రజలకు అందరికీ ఒక హక్కుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



## ఉమ్రా యాత్రికులకు ఓర్పు ముఖ్యం



ఖమ్మం ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే ): ఉమ్రా యాత్రికులకు ప్రధానంగా ఓర్పు ముఖ్యమని తవ్వాఫ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ బాధ్యులు హాఫీజ్ మొహమ్మద్ జవాద్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూగర్ షాది ఖానాలో రంజాన్ స్పెషల్ ఉమ్రా యాత్రికుల బృందం కు యాత్ర సందర్భంగా పురస్కరించు కోని ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏదైనా మంచి పని తలపెట్టినప్పుడు అల్లా పేరు మీద నిర్ణయం తీసుకోవాలని , సుదూర ప్రాంతానికి ఉమ్రా చేస్తున్న ప్రయాణికులు డబ్బు , సమయం అంటే విలువైన దాని సందర్శన కు వెళ్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. మక్కా , మదీనాలలో వారం రోజులు పాటు యాత్ర సాగుతుందని ఇక్కడ తవాఫ్, సఫా, మరువా , మహమ్మద్ ప్రవక్త పై దరుద్ అంశాలతో పాటు ప్రయాణికులకు విధించిన గైడ్లెన్స్ ను తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మదర్సే ఆయేషా నిస్వాన్ (హైదరాబాద్ ) కరస్పాండెంట్ మౌలానా ఖాజా నజిరుద్దీన్ సహాబ్ మాట్లాడుతూ ఉమ్రాతో ప్రయాణికులు పాప రహితంగా తయారవుతారని , వారి పాపాలన్నీ కడిగి వేయబడతాయని ,తల్లి కడుపు నుండి అప్పుడే జన్మించిన శిశువుల ను తలపిస్తారని అన్నారు. యాత్ర కన్నా ముందు ఉన్న జీవితాన్ని మార్చుకొని యాత్ర అనంతరం కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. కాగా ఉమ్రా యాత్రికులు కోసం క్యూర్ హాస్పిటల్ సౌజన్యంతో తవాఫ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్త్ చెకప్ క్యాంపు ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యూర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ వై .పాషా , డాక్టర్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

**- రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ**

**-మార్చిలో టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా మహాసభలు**

ఖమ్మం, ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే): జర్నలిస్టుల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ ఆరోపించారు. అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాల సమస్యలతో పాటు ఇతర సమస్యలు ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) స్టీరింగ్ కమిటీ సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఖమ్మం లో జరిగింది. ఈ సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ ఒక పక్క జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే మరో పక్క సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాజీ ధోరణిని అవలంభించబోదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన అక్రిడేషన్ల విషయంలో ఒక నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. హెల్త్ కార్డుల సమస్య కూడా పెండింగ్లో ఉందని పలువురు జర్నలిస్టులు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మంజిల్లా మహాసభలను మార్చి చివరి వారంలో వైరాలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనితో పాటు మాటేటి వేణుగోపాల్ కన్వీనర్ గా క్రమశిక్షణ కమిటీని, మైసా పాపారావు కన్వీనర్గా, సభ్యత్వ స్క్రూట్నీ కమిటీని ఏనుగు వెంకటేశ్వరరావు కన్వీనర్ మహాసభల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలువురు జర్నలిస్టులను ఈ కమిటీ సభ్యులుగా ఎంపిక చేయడం జరిగింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో పోరాట కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర బాధ్యులు నర్వనేని వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి కనకం సైదులు, జిల్లా కోశాధికారి శివానంద, ఖమ్మం నియోజక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్



రామడుగు,ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): మండలంలో సాగు నీటి సమస్యలతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపూర్ చెరువును కాళేశ్వరం ద్వారా నింపి మండలానికి సాగు నీరు అందించాలని వారు కోరారు.రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని,రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని తక్షణమే స్థానిక శాసనసభ్యులు స్పందించి జిల్లా యంత్రాంగంతో సంప్రదింపులు జరిపి నారాయణపూర్ చెరువు నుండి దిగువన ఉన్న వాగు ద్వారా గంగాధర, నాగిరెడ్డిపూర్, షానగర్, కొరటపెల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, కొక్కెరకుంట, వన్నారం, ఇరుకుళ్ల, దూర్శెడ్ గ్రామాల రైతులకు సాగు నీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం నకు ఉందని తెలిపారు.రైతే వెన్నెముక, రైతే రాజు అని చెప్తున్న ప్రభుత్వం ప్రస్తుతం రైతును అదుకోలేకపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఒండు రోజుల్లో నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.




## పట్టభద్రుల ఎన్నికల్లో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి గిరిజన సంఘాల మద్దతు

### గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ బీమా సాహెబ్

కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే):ఈనెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్,ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వుట్కూరికి గిరిజన సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ బీమా సాహెబ్ తెలిపారు. కరీంనగర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్ టి సెల్ జిల్లా అధ్యక్షుడు భానోత్ శ్రావణ్ నాయక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జి.శివరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ పతి నాయక్,తెలంగాణ గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి.రవీందర్ నాయక్,గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు సింహాద్రిలతో కలిసి ఆయన మాట్లాడుతూ దాదాపుగా నాలుగు దశాబ్దాలుగా విద్య, ఉపాధి రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వానికి తగిన సలహాలు,సూచనలు చేస్తూ నిరుద్యోగ పట్టబద్రుల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడతారని అన్నారు.శాసనమండలిలో విద్యా ఉపాధి అవకాశాలపై సంపూర్ణ చర్చలలో పాల్గొనే అవకాశం ఉందని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్ రెడ్డి ఊట్కూరి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టబదులకు పిలుపునిచ్చారు.బిజెపి అభ్యర్థిని ఈ ఎన్నికల్లో ఓడించాలని రాష్ట్రస్థాయిలో గిరిజన సంఘాలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం గిరిజనులను మోసం చేసిందని అన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని మోడీ హామీలు మాటలకే పరిమితమైందని అన్నారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ఎప్పటికైనా రద్దు చేయాలని కుట్ర పన్నుతున్న బిజెపి పార్టీ అభ్యర్థులకు పట్టభద్రులు, మేధావులు ఓటుతో గుణపాఠం చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు శివ, శ్రీనివాస్, సురేష్, రమేష్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.



## ఆర్టీసీ డిపో ముందు ప్లే కార్డులతో రిటైర్డ్ కార్మికుల ధర్నా

పెద్దపల్లి జిల్లా: జనవరి. 24 (వాయిస్ టుడే) గోదావరిఖని డిపోముందు రిటైర్డ్ కార్మికులు వారి పెండింగ్ సమస్యల పై ప్లే కార్డులు చేతబట్టి 12 గంటలు "మౌన ప్రదర్శన చేసినారు. మౌన ప్రదర్శన. కొనసాగిస్తూ రాత్రి డిపో ముందు సాగిస్తాను అన్నారు డిపో మేనేజర్ వినతి పత్రం అందచేశారు. రిటైర్డ్ కార్మికులు వారికి రావలసిన బకాయిలు సంవత్సరాల తరబడి కాలయాపనతో యజమాన్యం ఉందని అన్నారు. వారికి పెన్షన్ చాలా తక్కువగా ఉండడంతో కుటుంబం గడవక లేక పోతుందని, అన్నారు. 35 సంవత్సరాలు పని చేసి రిటైర్ అయినా వారి బకాయిలు చెల్లించుట లేదని అన్నారు కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో చనిపోయాక. బకాయిలు చెల్లిస్తారా? రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై త్వరగా నిర్ణయం తీసుకొని రిటైర్డ్ కార్మికుల కుటుంబాలను ఆర్టీసీ యాజమాన్యం ఆదుకోవాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో 50 మంది కార్మికులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ కో-ఆర్మనేటర్లు నాగేందర్ బానయ్యగారు. కనకయ్య, రెడ్డి, స్త్రీ బెంజిమెనారు, రెడ్డి, అరుపతి, అమ్మాద్ రెడ్డి, అధిక సంఖ్యలో రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానించిన డీసీసీ అధ్యక్షుడు

కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార నిమిత్తం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నిజామాబాద్ పట్టణానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు పూలబొకేను ఇచ్చి ముఖ్య మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు ఉన్నారు.



# మీరు విచారణ చేస్తూ మమ్మల్ని అరెస్ట్ చేయమంటారా?

**మీరు చీకటి ఒప్పందాలు చేసుకుని మాపై బురద చల్లుతారా?**

**దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలన్నీ సీబీఐకి అప్పగించండి**

**ఓటమి భయం సీఎంలో కన్పిస్తోంది**

**సర్వేలన్నీ కాంగ్రెస్‌కు 3వ స్థానమేనని తేల్చేశాయి**

**సర్కార్‌కు ధోకా లేకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఎందుకొచ్చినట్లు?**

**51 శాతమున్న బీసీలను 46 శాతానికి తగ్గించి బుకాయిస్తారా?**

**బీసీ జాబితాలో ముస్లింలందరినీ కలిపి బీసీలకు అన్యాయం చేస్తూ కూడా మేలు చేసినట్లు అబద్దాలాడతారా?: బండి సంజయ్**



కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే):ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగమంతా పచ్చి అబద్దాలు,అర్ధ సత్యాలతో నిండిపోయింది అని కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి ఖాయమనే భయం ముఖ్యమంత్రిలో స్పష్టంగా కన్పిస్తోంది.ఇంటెలిజెన్స్ సహా అన్ని సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చేశాయి.కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందని నివేదికలివ్వడంతో దిక్కుతోచని ముఖ్యమంత్రి హడావుడిగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చి ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్ ల్లో పాల్గొంటూ అబద్దాలాడుతూ,ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.గెలిచినా ఓడినా ప్రభుత్వానికి ధోకా లేదు.నాకేం ఫరఖ్ లేదని బుకాయిస్తున్నడు. అంత ధీమా ఉంటే ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చినట్లు? చరిత్రలో ఇంతవరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్న దాఖలాల్లేవు. ఓటమి భయం పట్టుకుంది కాబట్టే ఎన్నికల్లో పాల్గొంటూ డబ్బు,అధికార బలంతో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారు.దీనికితోడు ఓడిపోతే మీ సమస్యలను పరిష్కరించబోనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.ఇయాళ రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్,గొర్రెల స్కాంలపై మాట్లాడిన వ్యాఖ్యలు చూస్తే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారా? లేక మేము ఉన్నామా? అనే అనుమానం వస్తోంది.లా అండ్ ఆర్డర్ రాష్ట్రం పరిధిలోనిది. కేసీఆర్ కుటుంబం,బీఆర్ఎస్ నేతలు స్కాంలు చేసింది రాష్ట్రంలోనే దొచుకున్న సొమ్మంతా తెలంగాణ ప్రజలదే. విచారణ చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమే.కొంత మంది నిందితులను అరెస్ట్ చేసింది ప్రభుత్వమే.లా అండ్ ఆర్డర్ మీ చేతిలో పెట్టుకుని మీరెందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందించడం చూస్తుంటే నవ్వొస్తుంది.ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పోతే కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు సహా ఆయా స్కాంల సూత్రధారులు తెలంగాణలోనే ఉన్నారు కదా? మరి వాళ్లను ఇన్నాళ్లుగా ఎందుకు అరెస్ట్ చేయలేదు?అన్ని ఆధారాలున్నాయని చెబుతూ రాధాకిషన్ రావుసహా కొందరు అధికారులను అరెస్ట్ చేసి 10 నెలలకుపైగా జైల్లో ఉంచిన మీరు కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయలేదు? పైకి తిడుతున్నట్లుగా ఉంటూ నటిస్తూ కేసీఆర్ కుటుంబంతో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అరెస్ట్ కాకుండా కాపాడుతూ ఆయా కేసులను నీరుగారుస్తున్నది మీరు కాదా? మీకు నిజంగా నిజాయితీ ఉంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్, గొర్రెల స్కాం,కాళేశ్వరం, కేటీఆర్ బామ్మర్ది డ్రగ్స్ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని లేఖ రాయండి.ఆయా కేసుల్లో దోషులెవరైనా అరెస్ట్ చేసి బొక్కలో వేయించే బాధ్యత కేంద్రం తీసుకుంటది. రాష్ట్ర ప్రభుత్వం కోరకుండా న్యాయ స్థానాల ఆదేశాలు లేకుండా సీబీఐ తనంతట తాను విచారణ జరిపే అధికారం లేదని తెలిసి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కేంద్రంపై బురద చల్లడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనం.బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ ముఖ్యమంత్రి అర్ధసత్యాలు, అబద్దాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 51 శాతం ఉందని, ఆ సంఖ్యను 46 శాతానికి ఎట్లా తగ్గిస్తారని అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, హరీష్ రావులే చెప్పారు. మరి ఆనాడెందుకు ముస్లిం జనాభా గురించి సీఎం నిలదీయలేదు? రాష్ట్రంలో ఉన్న ముస్లింల్లో 80 శాతం మందిని బీసీ జాబితాలో చేర్చి రిజర్వేషన్లు అమలు చేసి నిజమైన బీసీ బిడ్డల పొట్టకొడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? బరాబర్ మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తాం. బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి బీసీ బిల్లు పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మేం తీసుకుంటాం అన్నారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభ

**ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి**

**నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు**

కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): నిరుద్యోగులకు అండగా నిలిచింది కేవలం కాంగ్రెస్ పార్టీయేనని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని గ్రాడ్యుయేట్స్ ను కోరారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోనుందని తెలిపారు.కరీంనగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సీఎంకు పలువురు మంత్రులు ఘనస్వాగతం పలికారు. సీఎంకు కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి జ్ఞాపిక అందజేశారు. పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు శాలువాలతో సత్కరించారు. ఎందరో మహానుభావులు పుట్టిన గడ్డ కరీంనగర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ మీ అభ్యర్థి ఎవరో ప్రకటించండంటూ ప్రశ్నించారు.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు,కవిత లు స్వయంగా మీ ఓట్లు ఎవరికి వేయదలుచుకున్నారని అడిగారు. ఎమ్మెల్సీ బరిలో దింపేందుకు అభ్యర్థి దొరకలేదా అని కేసీఆర్ ను ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం కుదిరిందని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని బీఆర్ఎస్ కంకణం కట్టుకుందన్నారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ దేనని స్పష్టం చేశారు. డీఎస్సీ, టెట్ పెట్టకుండా బీఆర్ఎశ్ నిర్లక్ష్యం చేసిందని 11వేల మంది టీచర్ల నియామకం చేశామన్నారు. ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు అందించింది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. మట్టిలో మానిక్యాలను వెలికి తీయాలనే సంకల్పంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఒలంపిక్స్ లో తెలంగాణా నుండి భారీగా పథకాలు రాబోతున్నాయని చెప్పారు. ఈ యూనివర్సిటీ చైర్మన్ గా ఆనంద్ మహీంద్రాను నెలకొల్పామని గుర్తుచేశారు. విప్లవాత్మకమైన మార్పులతో తెలంగాణాను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు కాంగ్రెస్ పట్టం కడుతోందని తెలిపారు.27వ తేదీన జరుగబోయే ఉత్తర తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆనాడు ప్రశ్నించే గొంతు అవసరమయ్యిందని ఈనాడు ప్రజాస్వామ్య పాలనలో నరేందర్ రెడ్డి గెలుపు అవసరమని చెప్పారు.317 జీవో పై రాష్ట్ర ప్రభుత్వ స్పష్టంగా ఉందని తెలిపారు. ఈ సమావేశానికి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, సీతక్క,ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కిన కలం కార్మికులు కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు

**కలెక్టర్లకు వినతి పత్రాలు**

**హైదరాబాద్‌లో సమాచార భవన్ ఎదుట నిరసన**



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. సోమవారం అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద జర్నలిస్టుల నిరసన కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ నాయకులు ఆయా జిల్లాల కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాపిత ఆందోళనలో భాగంగా హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ లో గల రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్)వద్ద జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు తీర్పు సాకుతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం,కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇంత వరకు ఇవ్వకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నారు. జర్నలిస్టుల పట్ల గత ప్రభుత్వ మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చిన్న చూపు చూడకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంపానెల్మెంట్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, హెల్త్ కార్డులు లేక, వైద్య సదుపాయాలు అందక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు వందల మంది జర్నలిస్టులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఆరోగ్య భీమా పథకం, పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ ఎస్. హరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించి సమస్యలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఎస్ కే సలీమా, కార్యవర్గ సభ్యులు కె. పాండురంగారావు, పి.నాగవాణి, మణిమాల,నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్,రవికుమార్, సీహెచ్ రంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్వోలు సమన్వయంతో పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి**





కరీంనగర్, ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సహా 15 జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్ ఎన్నికల పరిశీలకులు బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ఉన్న అన్ని జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ ప్రక్రియ మొదలు తుది ఫలితాలు వెల్లడి వరకు అందుబాటులో ఉంటూ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని అన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.పోలింగ్, కౌంటింగ్ రోజున అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ కు హాజరు అయిన రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆయన దృష్టికి పలు వివరాలు తీసుకుని వచ్చారు.15 జిల్లాల పరిధిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సుల రిసెప్షన్ కేంద్రం కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేశామని అన్నారు.అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ కి పంపించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసామని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా పోలైన ఓట్ల బ్యాలెట్ బాక్సులను కూడా కరీంనగర్ లోని కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని అన్నారు.జిల్లాల వారీగా, గ్రాడ్యుయేట్, టీచర్స్ వారీగా కౌంటర్లు ఏర్పాటు చేస్తామని, బ్యాలెట్ బాక్సులు సంబంధిత కౌంటర్లలో స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కి సీసీ కెమెరా,వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు.వెబ్ కాస్టింగ్ లో సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో కౌంటింగ్ సెంటర్ సిద్ధం చేశామని,సుమారు 23 టేబుల్ లలో గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.కౌంటింగ్ ప్రక్రియ కోసం ప్రత్యేక బాక్సులను తయారు చేయించామని అన్నారు.

# ఇరుకైన వంతెన విస్తరణ కోసం బీఆర్ఎస్ ధర్నా

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై RSP తీవ్ర విమర్శలు




ఆసిఫాబాద్ జిల్లా,కాగజ్ నగర్, వాయిస్ టుడే : కాగజ్ నగర్ నుంచి ఇతర మండలాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఇరుకైన వంతెన విస్తరణ కోసం బీఆర్ఎస్ నేతలు, ప్రజలు భారీగా రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎస్.ఎల్.బి.సి ప్రమాదంలో ఎనిమిది మంది చిక్కుకున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారని ధ్వజమెత్తారు.

**ఇరుకైన వంతెన వల్ల ప్రమాదాలు.....**

ఇరుకైన వంతెన కారణంగా నెలకు రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతున్నా, కనీసం రేడియం బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని బయటపెడుతుందని ఆయన మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతున్నా, ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

**అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలు.......**

అందవెల్లి బ్రిడ్జి ఇప్పటికి పూర్తికాలేదని, అలాగే సిర్పూర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఇప్పటికీ అసంపూర్తిగా ఉందని గుర్తుచేశారు. పాలకులు పనులు పూర్తి చేయకుండా కేవలం బిల్లులు ఎత్తుకోవడమే చూస్తున్నారని విమర్శించారు.

**"2.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో 10 కోట్లు కేటాయించలేరా?"......**

కేవలం 3-4 కోట్ల రూపాయలతో రెండు బ్రిడ్జిలను విస్తరించవచ్చని, కానీ ప్రభుత్వం నిధులు కేటాయించకుండా ప్రజలను దుర్భర పరిస్థితుల్లో ఉంచుతోందని మండిపడ్డారు. 2.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో సిర్పూర్ ప్రజలకు కనీసం 10 కోట్లు కేటాయించలేరా? అని ప్రశ్నించారు.

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై విమర్శలు......**

స్థానిక ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రొసీడింగ్స్ తీసుకొస్తున్నా, పనులు చేపట్టడం లేదని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యే హరీష్ బాబు ఇతర ప్రాంతాల సమస్యల గురించి మాట్లాడుతున్నా, సిర్పూర్ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**ప్రభుత్వానికి మాస్ వార్నింగ్......**

వంతెన విస్తరణ కోసం నెలరోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ సమస్య ముందుగా పరిష్కరించి ఉంటే, ప్రాణాలు కోల్పోయిన పిల్లలు బతికేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులతో పాటు ఈస్గాం, రాస్పెల్లి, కాగజ్ నగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భాజపాలోకి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పని ఆహ్వానించిన సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు



సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ టీ మండలం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గారి రాజకీయ పరిస్థితి క్లిష్టంగా మారిందని, కాంగ్రెస్ వారిని అంగీకరించకపోవడం, బిఆర్ఎస్ వారిని పట్టించుకోకపోవడంతో వారిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆయన అనుభవానికి, వయసుకు గౌరవం కల్పిస్తామని, భాజపా బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అలాగే, సిర్పూర్ నియోజకవర్గంలో అతిథి నాయకులు పర్యటనలు చేస్తూ విమర్శలు చేయడం సముచితమని ఆయన పేర్కొన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా గత సంవత్సరం 10 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, ఈ సంవత్సరం 20 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసి రూ.1500 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వ కృషి వల్ల సాధ్యమైందని ఆయన వివరించారు. అలాగే, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, కొన్ని పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

**భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి........**

కౌటాల మండల కేంద్రంలోని మయూరి విద్యాలయం, భారతి విద్య మందిర్, శ్యామ్ మోడల్ స్కూల్ పాఠశాలలను సందర్శించి, భాజపా టీచర్స్ మరియు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రజల గొంతుకగా నిలిచే భాజపా టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ అంజి రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. శాసన మండలిలో ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచి పోరాడేది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో భాజపా సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటిసి అరిగెల నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షురాలు లావణ్య, నీరటి సత్యనారాయణ, ఏల్ములే శంకర్, అశోక్ ఆర్య, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ ఎంపీటీసీ మోతిరాం, భీమన్న, బండురావు, తిరుపతి మేకల, మధుకర్, చందు, భూమన్న, శ్రీను, గోమాజి, వెంకటేష్, తిరుపతి, సాయి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాజంపేట రైతు వేదికలో జరిగిన జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ - కామారెడ్డి జిల్లా శిక్షణ కార్యక్రమం

కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24: రాజంపేట మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన 108 అంబులెన్సు సేవల గురుంచి IKP మహిళలందరికీ 108 అంబులెన్సు గురుంచి అవగాహన కల్పించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో 108 సిబ్బంది ఈ యంటి రాములు, పైలట్ ప్రశాంత్ పాల్గొనడం జరిగింది.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని TWJF నాయకుల వినతి



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ వాయిస్ టుడే : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (TWJF) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ వెంకటేష్ థోత్రే కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో గత కొన్నేళ్లుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు.జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని %ఔజీఖీ% నాయకులు డిమాండ్ చేశారు. అలాగే, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో TWJF జిల్లా అధ్యక్షులు జి. మహేష్, ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి. సురేందర్ రావు, సభ్యులు పి. సంతోష్, పి. నాగేందర్, ఎం. విష్ణు గౌడ్, బి. కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసేవి ఈ ఎన్నికలు




కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24 : తెలంగాణ భవిష్యత్తుకు ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు దిశా నిర్దేశం చేయనున్నాయని మహబూబ్ నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక వాళ్ళ అభ్యర్థిని పెడితే ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయంతో అభ్యర్థిని పెట్టలేదన్నారు.

బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని పెట్టలేదని కాంగ్రెస్ అంటోందని, మరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు 5 డిఎలు ఎన్నికలకు ముందు క్లియర్ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్కటి కూడా చేయలేదన్నారు. పీఆర్సీ ఇవ్వలేదని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయలేదని ఆరోపించారు. దేశంలో ఎక్కడా తెలంగాణ లాంటి పాలన లేదని, అభివృద్ధిలో తెలంగాణ మోడల్ అని చెప్తున్నారని, ప్రజల్ని మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ మోడల్ నా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల పేరుతో 420 హామీలిచ్చారని, అన్ని చేస్తున్నామని శ్వేతపత్రం విడుదల చేస్తారని, క్షేత్రస్థాయికి వెళ్తే పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. కొందరికి ఇచ్చి అందరికి ఇచ్చామని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అనుభవం లేని పాలన సాగిస్తున్నాడనీ, హామీలను దృష్టి మళ్లించేందుకు రోజుకొక మాట మాట్లాడుతున్నాడని, మోడీ నాయకత్వంలో దేశం దీక్షిత్ భారత్ గా ముందుకు సాగుతోందన్నారు. కోవిడ్ తర్వాత ధనిక దేశాలు ఆర్థికంగా చతికిల పడితే కింద పడకుండా మోడీ అభివృద్ధి వైపు తీసుకెళ్లాడని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపిందన్నారు. 8 ఎంపీ స్థానాలను ఇచ్చిన తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షించారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో బీజేపీ జెండా ఎగురవేశామన్నారు. ఎస్.ఎల్.బి.సి టన్నెల్ కూలిన ఘటనలో 42 మంది బయటపడ్డారని, మరొక 8 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదన్నారు. ఈ ఘటనపై సీఎంకు సీరియస్ నెస్ లేదని స్పష్టం అవుతుందన్నారు. ఈ సమయంలో ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన సీఎం ఎన్నికల ప్రచారంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెలవబోతుందని జోస్యం చెప్పారు. గెలిచే అభ్యర్థులను ఓడించేందుకు డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చారన్న ప్రచారాన్ని ఓ వర్గం మీడియా చేస్తోందని, ఇది ముమ్మాటికీ కుట్రలో భాగమేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులేనని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న జెండా ఎగురవేశామన్నారు. ఎస్.ఎల్.బి.సి టన్నెల్ కూలిన ఘటనలో 42 మంది బయటపడ్డారని, మరొక 8 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదన్నారు. ఈ ఘటనపై సీఎంకు సీరియస్ నెస్ లేదని స్పష్టం అవుతుందన్నారు. ఈ సమయంలో ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన సీఎం ఎన్నికల ప్రచారంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెలవబోతుందని జోస్యం చెప్పారు. గెలిచే అభ్యర్థులను ఓడించేందుకు డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చారన్న ప్రచారాన్ని ఓ వర్గం మీడియా చేస్తోందని, ఇది ముమ్మాటికీ కుట్రలో భాగమేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులేనని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణ తార, కామారెడ్డి, మెదక్ ఎమ్మెల్సీ ఇన్చార్జీలు గంగారెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24బీ ఈ నెల 27న నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న వారికి సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న (గురువారం) ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని సంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ సంస్థలలో పని చేసే పట్టభద్రుల నియోజకవర్గాలలో ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగి ఉన్న వారు నిర్ణీత సమయంలోపు ఓటు వేసేందుకు వీలుగా వారికి విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతించడం, షిఫ్టుల సర్దుబాటు, తక్కువ పని గంటలు కేటాయించడం వంటి వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ ఆయా యాజమాన్యాలకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తూ పట్ట భద్రులు, ఉపాధ్యాయుల కరీంనగర్ నియోజక వర్గానికి చెందిన ఉద్యోగులు ఓటుహక్కు కలిగియున్న వారు వారి ఓటును వినియోగించుకొనుటకు ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించడం జరిగిందని, ఆయా కార్యాలయాల అధికారులు అట్టి సెలవును మంజూరు చేయవలసిందనీ తెలిపారు.



## అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపిన ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు

**కామారెడ్డి జిల్లా కలెక్టర్ స్పందించాలి...**

**తుది జాబితాలో ఉన్న వారి ఓట్లను యధావిధిగా ఉంచాలని నిరసన..**

**తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ బాలు..**

కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు ఉపాధ్యాయుల టీచర్ ఎమ్మెల్సీ ఓట్లను తప్పుడు ఫిర్యాదుతో తొలగించడం జరిగిందని తుది జాబితాలో ఉన్న ఓట్లను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తొలగించడం సరికాదని తుది జాబితాలో ఉన్న వారందరినీ ఓటు వేయడానికి అనుమతించాలని ఈ విషయమై కామారెడ్డి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బాలు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ మహేందర్ రెడ్డి పేరుతో తప్పుడు ఫిర్యాదు చేయడం జరిగిందని కొందరు ఎమ్మార్వోలు అవగాహన లోపంతో ప్రైవేటు అధ్యాపకులు ఉపాధ్యాయుల ఓట్లను తొలగించారని,అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేసి తుది జాబితాలో ఓట్లు వచ్చిన తర్వాత ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు, తప్పుడు ఫిర్యాదు చేసిన వారి పైన చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఉపాధ్యాయులు అధ్యాపకులు తమకు అనుకూలంగా ఓటు వేయరని దురుద్దేశంతో ఒక ఉపాధ్యాయ సంఘం వారు ఈ పనిని చేయడం వారి యొక్క అవివేకానికి నిదర్శనం అని అన్నారు,ప్రజాస్వామ్యంలో ఉన్నత విద్యావంతుల ఓట్లను తొలగించడం చాలా బాధాకరమని దీనిపైన జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని అర్హులైన వారందరి ఓట్లను యధాతధంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం పట్టణ అధ్యక్షుడు నరేందర్ గౌడ్,బీమా గౌడ్,రవి,శ్రీధర్ లు పాల్గొనడం జరిగింది.



## కంటి పరీక్షలు చేయించుకోవాలి

కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24బీ ప్రతి విద్యార్థి కంటి పరీక్షలు చేయించుకోవాలని కామారెడ్డి జిల్లా కంటి వైద్యాధికారి లింబాద్రి చెప్పారు. సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్నవారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని కంటి అద్దాలు వాడాలని సూచించారు.

## పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి కలెక్టరేట్ లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి వాయిస్ టుడే ఫిబ్రవరి 24: ఏం.ఎల్.సి. ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి కలెక్టరేట్ లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఏం.ఎల్.సి. పట్టభద్రుల నియోజకవర్గం లో ఓటు హక్కు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారు ఓటును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
మంగళవారం, 25 ఫిబ్రవరి 2025

# గత ప్రభుత్వం మా బ్రతుకులను ఆగం చేసింది ప్రజాపాలన ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి

**కనీస సౌకర్యాలు లేక మా బ్రతుకులు ఆగమైపోతున్నాయి**

**మాకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వాలి**



హుస్నాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 25 : సిద్దిపేట జిల్లా అక్కెనపేట మండలంలోని హథిరాం గ్రామస్తులం మా గ్రామంలోని సమస్యలపై మాకు కనీస సౌకర్యాల కల్పనకై పోరాటం చేస్తూ మీ అందరికీ మా యొక్క బాధలు తెలియజేయాలని ఉద్దేశంతో మా యొక్క కన్నీటితో చెప్తున్న మాటలు ఇవి దయచేసి వినండి అని అథిరాం తండావాసులు మాట్లాడుతూ.. సార్ మాకు 2009లో ప్రాజెక్టు పనులు స్టార్ట్ అయినవి అందులో సార్ మేము బావులు బోర్లు మరియు భూములు అతి తక్కువ రేటుకు గవర్నమెంట్‌కు సహకరించి భూములు ఇవ్వడం జరిగింది కానీ సార్ మాకు ఈ తండావాసులకు అప్పటి ప్రభుత్వం 2009లో మమ్మల్ని సర్వే చేసి ప్రాజెక్టులో ఆర్డీ 11 ఇండ్లు ప్రాజెక్టులో పోయినాయి ఎఫ్ ఆర్ ఎల్ 100 లో 86 ఇల్లు పోతున్నాయి కొన్ని ఇండ్లు ఉంటున్నాయి కాబట్టి పై అధికారులతో జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి వాటిపై డిసిషన్ తీసుకుంటామని చెప్పి అప్పటి ప్రభుత్వం కొన్ని రోజులు గడిపేసింది దాని తర్వాత మన అదృష్టవంతో మన తెలంగాణ మన ప్రభుత్వం మన స్వరాష్ట్రం అని అప్పుడు ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డ కే చంద్రశేఖర రావు గండిపల్లి ప్రాజెక్టు దగ్గర వచ్చి కూర్చొని ఇది చాలా చిన్న ప్రాజెక్టు ఇది ఎవరికి సరిపోదు దీన్ని 0.5 ఉన్నదాన్ని 1.5 కి మార్చండి అని అధికారులకు సూచన ఇచ్చి అందులో భాగంగా గండిపల్లిలో ఉన్న 11 తండాలు మరియు అంకుశపూర్ ఊర్లో మూడు తండాలు పోతున్నాయి మొత్తం వీరికి నష్టపరిహారం ఇచ్చి వీరిని ఆదుకొని ప్రాజెక్టు పనులు ముమ్మరంగా ప్రారంభించండి అని చెప్పిన కేసీఆర్ 10 సంవత్సరాలు గడుపుకున్నాడు కానీ తట్టెడు మట్టి కూడా పోయకుండానే హామీలతో సరిపెట్టుకున్నాడు దాని తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం జరిగింది కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టును సందర్శించడం జరిగింది. అప్పటికి పార్లమెంట్ సభ్యుడు అభ్యర్థి మన పొన్నం ప్రభాకర్ కూడా రేవంత్ రెడ్డి తో కలిసి రావడం జరిగింది దాని తర్వాత పొన్నం ప్రభాకర్ గారికి టికెట్ ఇవ్వడం జరిగింది ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం జరిగింది హుస్నాబాద్ నుంచి మంత్రి పదవిని కూడా ఆకర్షించుకోవడం జరిగింది కానీ మాకు పొన్నం ప్రభాకర్ చెప్పేది ఒకటే . గండిపల్లికి వచ్చినప్పుడు అల్లా మీకు పాత ప్రాజెక్టు కావాల్నా కొత్త ప్రాజెక్టు కావాలా ఎత్తు పెంచమంటారా తగ్గించమంటారా అనే మాటతో మాత్రమే సరి పెట్టుకోవడం జరుగుతుంది. సర్ మేం కోరుకునేది ఒకటే ప్రాజెక్టులో భాగంగా మాకు గత 15 సంవత్సరాల నుండి ఒకే ఇంట్లో నాలుగు ఫ్యామిలీలు మరియు మూడు ఫ్యామిలీలుగా బతుకుతున్నాం మాకు కొత్తగా ఇల్లు కట్టుకుందామని అంటే జిపి నుండి పర్మిషన్ లేవు కరెంట్ బిల్లు పర్మిషన్ లేదు కొత్త నల్లాల కనెక్షన్ లేదు ఏది మొదలుపెట్టిన మేము అభివృద్ధికి నోచుకునే ఉంటున్నాము మాకు మీరు దయదలసి మేము కోరుకునేది సార్ మాకు ప్యాకేజీలు మరియు ఇండ్ల డబ్బులు ఇచ్చి మమ్మల్ని తొందరగా ఆదుకొని ప్రాజెక్టులో నీళ్లు నింపి మమ్మల్ని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఇచ్చి ఆదుకోగలరని మిమ్మల్ని కోరుతున్నాం సార్ విలువైన భూమిని అతి తక్కువ రేటుకు రెండు లక్షల పదివేల మాత్రమే ఎకరం భూమి ఇచ్చి త్యాగం చేసిన మాకు ఎలాంటి న్యాయం ఇప్పటివరకు జరుగుతలేదు సార్ మీరు ఈ విషయం దృష్టిలో పెట్టుకుని మాకు తగిన న్యాయం చేస్తారని కోరుకుంటున్నాం.

## పట్టభద్రుల మరియు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

**జిల్లా అధికారుల సమన్వయంతో కలిసి ఎన్నికలు నిర్వహిస్తున్నాం**

**సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 163 BNSS-2023 సెక్షన్ అమలు**



వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 25 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మాట్లాడుతూ ఈ నెల 27న జరుగు పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఐపీఎస్ మేడమ్ గారు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 40, లొకేషన్లు 23,, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 27, లొకేషన్లు 27. మొత్తం పోలింగ్ స్టేషన్లు 67 అన్ని పోలింగ్ స్టేషన్లకు నెంబర్ మార్క్ చేయడం జరిగింది. పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ జియో ట్యాగింగ్ పూర్తి చేయడం జరిగింది. రూట్ మొబైల్స్ /08, స్ట్రైకింగ్ ఫోర్స్/ 24, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ /03, ఎఫ్ఎస్టి / విఎస్టి టీమ్స్/45,,,,, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి

ఏసీపీలు/03, సిఐలు/ 10, ఎస్ఐలు/ 27, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు/ 67, కానిస్టేబుళ్లు/ 312, మొత్తం పోలీస్ అధికారులు సిబ్బంది 419 మంది అధికారులు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, మరియు సిఐలు సర్కిల్ పరిధిలో ఏసీపీలు డివిజన్ పరిధిలో బందోబస్తు పర్యవేక్షణ చేస్తారని కమిషనర్ తెలిపారు.

**163 BNSS-2023 సెక్షన్ అమలు**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు తేదీ: 27-02-2024 నాడు ఉన్నందున. ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు గాను, తేదీ 25-02-2025 సాయంత్రం 4:00 గంటల నుండి, తేదీ 28-02-2025 ఉదయం 8:00 గంటల వరకు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల చుట్టూ 163 BNSS-2023 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఐపీఎస్ మేడం గారు సోమవారం ఉత్తర్వులు జారీ చేసినారు.

1 పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ 163 BNSS సెక్షన్ అమలులో ఉంది

2 ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువమంది కానీ గుంపులు గుంపులుగా తిరగవద్దు.

3 పార్టీ జెండాలు పార్టీ గుర్తులు ప్లే కార్డ్స్ ధరించవద్దు ప్రదర్శించవద్దు.

4 మైకులు లౌడ్ స్పీకర్లు వాడరాదు పాటలు ఉపన్యాసాలు ఇవ్వకూడదు.

6 ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటివి నిర్వహించడం నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. పోలీస్ కమిషనర్ మేడం గారు తెలిపారు.

పట్టభద్రులు, టీచర్లు పోలీసుల సలహాలు సూచనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని సూచించారు.

## మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శ్రీ పార్వతి రామలింగేశ్వర దేవాలయం

- గుడివాడ బృందంచే చింతామణి నాటకం ప్రదర్శన
- గ్రామస్థాయి ముగ్గుల పోటీలు..... భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఇప్పటికే ఏర్పాట్లు సర్వం సిద్ధం.
- దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ ఫిబ్రవరి 24, (వాయిస్ టుడే ప్రతినిధి): నల్లగొండ జిల్లాలోని వేములపల్లి మండలంలో ఆమనగల్లు శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధిగాంచిన పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాభవుతోంది.దేవాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రదాత మహాశివరాత్రి వేడుకలకు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్టు చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈనెల 26 మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహాశివ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున ప్రజలు రామలింగేశ్వర స్వామి దేవాలయానికి తరలిరానున్న నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయశాఖ భద్రత ఏర్పాటు చేస్తుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. మహాశివ రాత్రి సందర్భంగా ఆమనగల్లు ఉమ్మడి గ్రామస్థాయిలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు, రైతులకు ఉత్సాహాన్ని నెలకొల్పేందుకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం సూర్యాపేట, మిర్యాలగూడ బృందాలచే కల్చరల్ ప్రోగ్రామ్స్, చింతామణి నాటక ప్రదర్శన గుడివాడ వారిచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే, గ్రామ ప్రజలు, దేవదాయశాఖ అధికారులు, పోలీస్ శాఖ సమిష్టి కృషితో శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. శివరాత్రి వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ కోరారు.



## మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వేములపల్లి ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే ): వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో శ్రీ శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 26 తారీఖున ఘనంగా నిర్వహించు మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ రాళ్ల వెంకటేశ్వర్లు పుట్టల కురుపయ్య పిల్లల సందీప్ నాయుడు కోల సైదులు జర్నలిస్టు మెరుగు భరత్ లు పాల్గొన్నారు.

## జాతరకు ముస్తాబవుతున్న పశ్చిమ చాళుక్యుల కాలంనాటి మహా శివలింగం

**దాదాపు 1000 సంవత్సరాల క్రితం మహా శివలింగ ప్రతిష్ట జరిగినట్టు తెలిపిన పురావస్తు శాఖ**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో కొలువై ఉన్న మహా శివలింగేశ్వరుడు జాతరకు అవుతున్నాడు ఈనెల 25 26 27 తేదీలలో జాతర ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు మరియు పూజారులు మరియు గ్రామ ప్రజలు గంటపదంగా తెలిపారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామక్క సతీష్ నరసింహమూర్తి అర్చకులు మాట్లాడుతూ దాదాపు 1000 సంవత్సరాల క్రితం పశ్చిమ చాలిక్యరాజులు ఈ యొక్క ఆలయ నిర్మాణాన్ని చేపట్టారని అయితే యుద్ధాల సమయంలో ఆలయం పూర్తిగా ధ్వంసం అయిందని తెలిపారు అయితే మన ప్రాంతంలో ఈ ఆలయం యొక్క ఆనవాళ్లు 1996 ప్రాంతంలో కుమ్మరి పోచయ్య పొట్లపల్లి గ్రామంలో తన ఇంటి నిర్మాణం కోసం పునాదినిర్మానం చేపట్టగా అందులోంచి శివలింగం బయటపడింది ఇది తెలుసుకున్న పురావస్తు శాఖ అధికారులు ఈ శివలింగాన్ని దాదాపు 1000 సంవత్సరాల క్రితం పూజలు అందుకున్న మహాశివుడిగా గుర్తించడం జరిగింది అక్కడ దొరికిన నవధాన్యాల ఆధారంగా ఈ యొక్క శివలింగం పశ్చిమ చాళుక్య కాలంలోని అని గుర్తించడం జరిగింది ఈ యొక్క శివలింగాన్ని 2006లో గ్రామ ప్రజలు చుట్టుపక్కల ప్రాంతాల వారు మరియు వివిధ దాతల సహకారంతో గుడి నిర్మాణం జరిగింది అప్పటినుండి నిరంతరాయంగా పూజల నిర్వహిస్తూ దీనిని అభివృద్ధిగా వెలుగొద్దుతూ ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని దాదాపు ఏటా మొదటి సంవత్సరం 50 వేల నుండి 2025వ సంవత్సరం వరకు దాదాపు రెండు లక్షల భక్తులు దర్శనం చేసుకుంటున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు అంతేకాకుండా ప్రతాపరుద్రుని కాలంలో ఈ యొక్క మహా శివలింగాన్ని ప్రత్యేకంగా అనేక పూజలు నిర్వహించారని శక్తివంతమైన శివలింగం అని స్వామివారిని దర్శించుకున్న వారికి అన్ని రకాల కోరికలు నెరవేరుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోవాలని వారికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని చలువపందిళ్లు మంచినీటి సౌకర్యం భోజన సౌకర్యం మరియు అన్ని రకాల సౌకర్యాలు చేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ప్రధాన అర్చకులు ప్రజలు ఊరి పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## కోర్టు తీర్పును అమలు చేయాలి

**నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమంగా ఇంటి స్థలం కబ్జా**

**యదేశ్చగా ఇంటి నిర్మాణం...కిరాయికి ఇచ్చి అద్దె వసూలు**

**తనకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను అభ్యర్దించిన కట్టా వెంకటేశ్వర్లు**



పాలేరు, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే )...... నిరుపేదకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని అధికార భలం, ఆర్థిక భలం,అంగబలంతో ఆక్రమంగా ఆక్రమించి, యాదేశ్చగా ఇంటి నిర్మాణం చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి అధికారులను, కోర్టును బురిడీ కొట్టిస్తూ, చివరికి పేదకు అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులను మభ్యపెట్టి ఇంకా అనుభవిస్తున్న సంఘటన పోలేపల్లిలో కొనసాగుతూ వుంది. వివరాల్లోకి వెళ్ళితే పోలేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రాజీవ్ గృహ కల్ప సమీపంలో 100 గజాల ప్రభుత్వ స్థలాన్ని నవంబర్ 2013 లో కట్టా వెంకటేశ్వర్లు అనే నిరుపేదకు పట్టా ఇచ్చారు.అయితే అతను ఆర్థిక సమస్య మూలంగా కొద్దిగా రోజులు ఇంటి నిర్మాణం చేపట్టలేదు. కాగా అట్టి ఇంటి స్థలం పై కన్నేసిన చీకటి శ్రీలత భర్త శ్రీనివాస్ గౌడ్ యదేశ్చగా రెండు గదులు రేకులతో నిర్మాణం చేపట్టి, కాంపౌండ్ వాల్ కూడా నిర్మించారు. ఈ విషయంపై నిరుపేద వెంకటేశ్వర్లు రెవిన్యూ అధికారులకు, పోలీసులకు పిర్యాధి చేసినా ఏ అధికారి కూడా న్యాయం చేయకపోవడంతో 2015 లో హై కోర్టును ఆశ్రహించారు. కాగా స్థలాన్ని కబ్జా చేసిన శ్రీలత, వెంకటేశ్వర్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు కోర్టును నమ్మించే ప్రయత్నం చేయగా కోర్టు విశ్వచించక కట్టా వెంకటేశ్వర్లకు అనుకూలంగా తీర్పును 2024 జూన్ లో తీర్పు ఇచ్చింది. అదే విధంగా ఆస్థలం, ఇంటి నుండి ఖాళీ చేయాలని శ్రీలతకు ఆదేశించింది. కానీ ఖాళీ చేయక పోవడంతో మరలా కోర్టు దిక్కారం కేసు కూడా వేయగా సంబదిత రెవిన్యూ అధికారులకు ఖాళీ చేయాలని సూచించింది. కాగా ఈ ఎనిమిది నెలల కాలంలో భాధితుడు తనకు న్యాయం జరగక పోవడంతో తిరిగి 24 ఫిబ్రవరి (సోమవారం ) నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ పెట్టుకోగా జిల్లా రెవిన్యూ అధికారులు ఏ అరుణ ఇట్టి దరఖాస్తును పరిశీలించి సంబదిత రెవిన్యూ అధికారికి పరిశీలన చేసి తగిన భాధితుడికి న్యాయం చేయాలని సూచించారు.ఇప్పటికైనా అన్యాయానికి గురైన కట్టా వెంకటేశ్వర్లకు తగిన న్యాయం జరగాలని ఈ విషయం తెలిసిన ప్రజలు ఎంతో ఆశగా,ఆసక్తిగా ఎదిరి చూస్తూ, మనసారా కోరుకొంటున్నారు.న్యాయానికి న్యాయం జరగాలని వేయి కళ్ళతో ఆశిస్తున్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: స్థానిక నాయకులు, రైతులు**



ముస్తాబాద్/ రాజన్న సిరిసిల్ల /వాయిస్ టుడే ప్రతినిధి/మెంగని రాజు /ఫిబ్రవరి,24: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో అప్పుల బాధ భరించలేక కౌలు రైతు జెల్ల దేవయ్య(51) ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దేవయ్య తనకున్న ఎకరం పొలం, 5 ఎకరాలు కౌలు తీసుకొని వరి పంట సాగు చేసుకుంటున్నాడు. సాగునీరు అందక పంటలు ఎండిపోవడం, పెట్టుబడికి తెచ్చిన అప్పులు, కూతురు పెళ్లికి తెచ్చిన అప్పులు ఎక్కువ అవ్వడంతో మనస్థాపానికి గురై, తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు అని తెలిపారు. మృతునికి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు. కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఈ ఫైలింగ్ విజయవంతం

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 24: ఈ ఫైలింగ్ 3.0 పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రాంలో రాష్ట్ర ట్రైనీస్ ముప్పు రవీంద్రారెడ్డి, సాముల రోహిత్ రెడ్డి శిక్షణలో భాగంగా మాట్లాడుతూ ఈ -ఫైలింగ్ ద్వారా కేసులు దాఖలు చేయడానికి డిజిటల్ రూపంలో మార్చే ప్రక్రియను ఆన్లైన్లోనే దావాలు, పిటిషన్లు, డాక్యుమెంట్లు, కోర్టు ఫీజులు, సివిల్ అప్పీలు, ఇతర సివిల్, క్రిమినల్ కేసులు సబ్మిట్ చేయవచ్చని ఇది ఒక ఆధునిక వర్షన్ అని, ఇది మరింత వేగవంతంగా,సురక్షితంగా, సులభంగా, నడిచే ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్,సెషన్స్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పాటిల్ వసంత్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి న్యామూర్తులు బత్తుల రామారావు,ఏ. సుచరిత, కె. సాయి శ్రీ, లు పాల్గొన్నారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, కార్యవర్గ సభ్యులు సాధిక్ పాషా, ఎస్. ప్రవీణ్ కుమార్ దూదిపాల రవికుమార్, , సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.



## బిఎస్పీ చర్ల మండల ప్రధాన కార్యదర్శిగా ఏకుల వెంకటేశర్లు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 24: బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల ప్రధాన కార్యదర్శి గా ఏకుల వెంకటేశ్వర్లు నియమితులైనట్లు బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కొండా కౌషిక్ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. చర్ల మండల బిఎస్పీ కార్యాలయం లో జరిగిన కార్యక్రమం లో భాగంగా ఇటీవల పార్టీ లో చేరిన ఏకుల వెంకటేశ్వర్లు గారిని ఆయన పార్టీకి మండల కీలక స్థానం లో సేవలందించాల్సిన అవసరం ఉందని భావించి నియమించి నట్లు తెలియ జేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన బిఎస్పీ భద్రాచలం నియోజక వర్గ అధ్యక్షుడు కొండా చరణ్ మాట్లాడుతూ ఎంబిసి లకు బహుజన్ సమాజ్ పార్టీ రాజకీయ అవకాశాలు కల్పించి రాజ్యాధికారం లో జనాభా కు తగిన వాటా ఇస్తుందని అన్నారు. బిసి,ఎస్సీ ఎస్టిలకు, మహిళలకు, మతమైనారిటీలకు జనాభాకు తగిన రాజకీయ అవకాశాలు కల్పించేందుకే సామాజిక న్యాయ అజెండా గా బహుజన్ సమాజ్ పార్టీ స్థాపించ బడిందని,భద్రాచలం నియోజకవర్గ వ్యాప్తంగా బిసి,ఎస్సి,ఎస్టి ప్రజల పెద్ద ఎత్తన పార్టీ లో చేరుతుండడం,రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కి లభిస్తున్న ఆదరణ చూస్తుంటే బహుజన రాజ్యం రాబోతోందని అనిపిస్తోందని అన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 24: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం జిల్లా కలెక్టర్ ఐడిఓసి కార్యాలయం వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, జిల్లా కార్యదర్శి గుండెబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై నిరసన, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు రెండవ విడత అక్రిడిటేషన్ లు జారీ చేయలేదన్నారు. దాంతో సీనియర్ జర్నలిస్టు సైతం సీనియార్టీనీ కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని. అనేక ఒడిదుడుకులు మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నారని వారన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా జర్నలిస్టులో ఎదురుకుంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలన్నారు. జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొత్త ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలని, జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలని, ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని, కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందు కోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని,

అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలని. జర్నలిస్టుల దయనీయ పరిస్థితులను దృష్టిలోపెట్టుకుని వెంటనే సమస్యలను పరిష్కరించేలా, చర్యలు తీసుకొనేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిశెట్టి సైదయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వెలమ రాజేందర్, సీనియర్ పాత్రికేయులు నేరెళ్లకుంట సుధాకర్ రావు, మహిళా పాత్రికేయురాలు మధుళిక, పాత్రికేయులు మాణికల సీతయ్య, శివనాగిరెడ్డి, కుంజా వెంకటేష్, ఆకుల శివ, రమేష్, గొడ్డుగొర్ల నాగరాజు, ఎ ఫణి, రబ్బాని, రాందాసు, జీవన్ శివ కుమార్, సుధీర్, రాఘవేందర్ రావు, వీర రాఘవయ్య, భాషిదు జిల్లా కమిటీ సభ్యులు ములకలపల్లి గోపీనాథ్, పర్సబోయిన రాధాకృష్ణ, పాత్రికేయులు తాండ్ర వెంకటరావు, పాల లెనిన్ విజయ్ కుమార్, దూదిమెట్ల కోటేశ్వరరావు, కామేపల్లి నాగరాజు, యానాల మల్లారెడ్డి, దేవరపు శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## జర్నలిస్టులకు ఇండ్లు కేటాయించాలి

### కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ నిరసన

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ఫిబ్రవరి 25 : మహబూబ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులందరికీ తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమంలో భాగంగా మహబూబ్నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు ప్రజాసంఘాలు, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అర్హులుగా గుర్తించి వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ పట్టణం మౌలాలి గుట్ట వద్ద నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హత కలిగిన జర్నలిస్టులకు గత ప్రభుత్వం కేటాయించిందని వారందరికీ యధావిధిగా ఇండ్లను వెంటనే అప్పగించాలని కోరారు. ఎస్వీఎస్ గుట్ట వద్ద జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్లను యధావిధిగా కొనసాగిస్తూ వారికి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీనియర్ జర్నలిస్టులు కొందరికి అన్యాయం జరిగిందని దానిని సరిచేసి అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు గూడు కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ కి, స్థానిక శాసనసభ్యులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు, చిన్న మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడంతోపాటు అడ్వర్టైజ్మెంట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బండి విజయకుమార్, కమిటీ నాయకులు మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకలపల్లి గోపాల్, ఫెడరేషన్ నాయకులు మెట్టుకాడి ప్రభాకర్, ఉమామహేశ్వరరావు, పసుపుల శ్రీనివాస్, ఎంవి రమణ, ముయిజ్ ఖాన్, సీనియర్ జర్నలిస్టులు సాజిదా సికిందర్, వై నర్సింలు, ప్రజాసంఘాల నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, నల్లవెల్లి కురుమూర్తి, పాతూరి రమేష్, వివిధ మండలాల జర్నలిస్టులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీల గెలుపుతోనే సామాజిక తెలంగాణ సాధ్యం

### బీసీలైన మల్కా కొమురయ్య ప్రసన్న హరికృష్ణ పూలే రవీందర్ ను గెలిపిద్దాం: తెలంగాణ విఠల



కరీంనగర్, ఫిబ్రవరి 24: భౌగోళిక తెలంగాణ కోసం పోరాడి సాధించుకున్నట్లు వెల్లడించిన సామాజిక వేత్త, ఉద్యమకారుడు తెలంగాణ విఠల్, సామాజిక తెలంగాణను బీసీలతోనే సాధించగలమని స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్లో జరిగిన సమావేశంలో తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డా. మహిపాల యాదవ్, బీసీ జేఏసీ జర్నలిస్ట్ సంఘం కన్వీనర్ కొత్త లక్ష్మణ్ పటేల్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతానికి పైగా ఉన్నప్పటికీ, రాజకీయంగా వారికి న్యాయం జరగడం లేదని విఠల్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు పట్టభద్రులు తమ ఓటును అమ్ముకోకుండా, బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీల ఓట్లు బీసీలకే పోతే అన్ని పార్టీలు వారిని గుర్తించే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనాభా లెక్కల్లో బీసీలను అవమానించిందని ఆరోపించారు. స్వయం శక్తితో ఎదిగిన మల్కా కొమురయ్య విద్యాసంస్థల నెలకొల్పి ఎన్నో సేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. టీచర్ ఎమ్మెల్సీ కి పోటీ చేస్తున్న మల్కా కొమురయ్యను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ప్రసన్న హరికృష్ణ పూల రవీందర్ ను గెలిపించాలని అభ్యర్థించారు.

**అగ్రవర్ణ అభ్యర్థులు దోపిడీకి వస్తున్నారు...**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అగ్రవర్ణ అభ్యర్థులు విద్యావంతులను మోసం చేసి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విఠల్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, మల్క కోమురయ్య, పూల రవీందర్ లాంటి బీసీ అభ్యర్థులను పట్టభద్రులు గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డా. మహిపాల యాదవ్ మాట్లాడుతూ,19 ఏళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేసిన నేను పట్టభద్రులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాజీనామా చేసి బరిలోకి దిగాను అన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



## జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-24వాయిస్ టుడే: సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ లో బిజెపి అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కి మద్దతు గా బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి అల్లాపూర్ శ్రీనివాస్ గొట్టిముక్కల సురేష్ రెడ్డి ప్రచారం చేయడం జరిగినది. ఈ సందర్భంగా కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, అలాగే అంజిరెడ్డి గత కొన్ని సంవత్సరాల గా పేదలకు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, విద్యార్థుల కోసం తన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులను ఆదుకున్న విషయాలు తెలుపుతూ చిన్నమైల్ అంజిరెడ్డి కి మల్క కోమురయ్య లకు ఎమ్మెల్సీ పట్ట భద్రుల ఉపాధ్యాయుల మొదటి ప్రాధాన్యత ఇచ్చి బిజెపి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, బిజెపి సీనియర్ నాయకులు కడారి అశోక్ రావు, సొదరి మహేందర్ యాదవ్, కొమ్ము తిరుపతి, నాగులమల్యాల తిరుపతి, ఏగోలపు సదయ్య గౌడ్, గుడ్ల వెంకటేష్, గజబింకర్ పవన్, కోట నాగేశ్వర్, ఎల్లంకి రాజన్న, చిట్టవేణి సదయ్య, భూసారపు సంపత్, కందునూరి కుమార్, కొల్లూరి సంతోష్, ఏలవేణి తిరుపతి, నూనె మహేష్, బొట్టు శంకర్ గౌడ్, భాగ్యలక్ష్మి, లత, మెండ శంకర్, వేముల శ్రీనివాస్, వల్స సాయికిరణ్, ఈర్ల ప్రశాంత్, పోచంపల్లి ఈశ్వర్, అరవింద్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## పోలింగ్ సందర్భంగా ప్రచారం నిషేధం



**48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్**

**ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలు**

**బల్క్ ఎస్ఎంఎస్ లు పంపడం నిషేధం.**

**ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**జిల్లా ఎన్నికల అధికారి,**
**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 24: ఈ నెల 27న జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్ )అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నేడొక ప్రకటన లో తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25.02.2025 సాయంత్రం 4.00 గంటల నుండి 27.02.2025

సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సైలెన్స్ పిరియడ్ లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్.ఎం.ఎస్ లు, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపకూడదని, బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకూడదని, ప్రచారం చేయరాదని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు,ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎంసీసీ, టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.



## అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 24: రాష్ట్రవ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమై గల్లి గల్లికి మోడల్ స్కూల్స్,ఈ టెక్నో , ఫౌండేషన్ ,ఈ-టెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్చగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పి డి యస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ నరేందర్ అన్నారు.పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే పాఠశాల పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారని రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ రెండు విద్యా నియమాలకు విరుద్ధమైనవి. విద్యార్థులకు ప్రమాదకరమైనవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసి రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది పి ఆర్ ఓ లను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే విద్యాశాఖ అధికారులు,పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్,కార్పొరేట్ పాటశాలల్లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల,కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోశాధికారి పార్థసారథి, నాయకులు నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ఫిబ్రవరి 24: నవాబ్ పేట మండల పరిధిలోని కారు కొండ శివారులో అనుమతి లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ను కానిస్టేబుల్ అశోక్ గౌడ్ హెూం గార్డ్ గులాం హుస్సేన్ లు పట్టుకొని పోలీస్ స్టేషన్లో అప్పచెప్పారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ నెంబరు ఏపీ27యుబి2655 గల వాహనం యాజమాని బండ యాదయ్యపై కేసు నమోదు చేసి తహసిల్దార్ కు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుక సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ఫిబ్రవరి 24 : (జడ్చర్ల )నవాబుపేట్ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అమ్మాపూర్ లో చోటుచేసుకుంది.ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం అమ్మాపూర్ గ్రామానికి చెందిన అంకూరి కృష్ణయ్య(57)ఈనెల19వ,తేదీన తన పనులు ముగించుకొని నవాబుపేట్ నుండి రాత్రి 8 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం(టీవీఎస్)పై అమ్మాపూర్ గ్రామానికి తిరిగి వెళుతుండగా,మండల కేంద్రానికి చెందిన సమీర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనతో ఢీకొట్టడంతో కృష్ణయ్య తలకు,కాళ్లకు బలమైన అయ్యాయి.108 వాహనంలో కృష్ణయ్యను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,జిల్లా వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సకు హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా,అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కృష్ణయ్య మృతి చెందినట్లు,కృష్ణయ్య కుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.